

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 306 | సోమవారం 16 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,



₹30 వేల కోట్లు.. కావాలి

తెలంగాణకు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరిన సీఎం..

ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులపై విజ్ఞప్తి

హైదరాబాద్/న్యూఢిల్లీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా ప్రధానిని కలిశారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు తెలంగాణలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌తో పాటు, డిసెంబర్‌లో జరగనున్న ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ప్రధాని మోదీని సీఎం, మంత్రులు ఆహ్వానించారు.



రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు

కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం


తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు

ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

సోనియా పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్..

ప్రధానితో భేటీపై ఉత్కంఠ!



దూసుకొస్తున్న ఆక్వాన్ తుపాను..

- నవంబర్ 20న తుపాను ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశం
- నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాలో విస్తారంగా వానలు
- 21, 22 తేదీల్లో ఇతర జిల్లాలో కూడా కురవనున్న వర్షాలు



భారత మార్కెట్లలోకి మళ్లీ విదేశీ నిధుల ప్రవాహం..

భారీగా కొనుగోళ్లు చేస్తున్న ఎఫ్‌పీఐలు

- నవంబర్ 13 నాటికే రూ.79,301 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు
- సరికొత్త ఆల్‌టైమ్ రికార్డు దిశగా విదేశీ నిధుల ప్రవాహం
- అమెరికా ఎన్నికల ఫలితాలతో భారత మార్కెట్ వైపు మళ్లిన గ్లోబల్ ఇన్వెస్టర్లు



భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) కొనుగోళ్ల జోరును మరింత పెంచారు. దాదాపు 10 వారాల పాటు

మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన పవన్ కల్యాణ్

మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన పవన్ కల్యాణ్

శ్రీకాకుళం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి

కాకినాడ కార్పొరేషన్ మేయర్ బరిలో ఆకుల భవాని

రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థుల ప్రకటన

మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదల



ఆంధ్రప్రదేశ్‌లోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలలో మేయర్, ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే జనసేన అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఇటీవల ఎన్నికలు జరగ్గా మిగిలిన పట్టణ స్థానిక సంస్థల (ఖాదీ)కు నవంబరు 26న పోలింగ్ జరగనుంది. 4 కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఈ విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా ఈ ఎన్నికల్లో బరిలో దిగే తమ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది.



దేశ రాజధాని ఢిల్లీని కాలుష్య మేఘాలు వీడటం లేదు. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కాలుష్య నియంత్రణ చర్యలను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. నిబంధనలు పాటించని 191 పరిశ్రమలను మూసివేయాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఆదేశించింది. కాలుష్య నియంత్రణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఢిల్లీతోపాటు హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలను సమన్వయం చేసుకుంటూ సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ఆదేశించారు.

370కి చేరిన ఏక్యూఐ.. గాలి నాణ్యత అత్యంత దారుణం

ఢిల్లీలో 24 గంటల సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) సుమారు 370 వద్ద కొనసాగుతోంది. ఇది 'వెరీ పూర్' (చాలా దారుణం) కేటగిరీ పరిధిలోకి వస్తుంది. మొత్తం 59 గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్లో నమోదైన వివరాల ప్రకారం.. 17 కేంద్రాల్లో గాలి నాణ్యత 'సివియర్' (తీవ్ర కాలుష్యం) స్థాయికి చేరింది. మరో 38 కేంద్రాల్లో 'వెరీ పూర్', మూడు కేంద్రాల్లో 'పూర్' స్థాయిలో నమోదైంది. ఒక్క కేంద్రంలో మాత్రమే 'మోడరేట్' స్థాయి గాలి నాణ్యత కనిపించింది. ప్రధానంగా పీఎం10 కాలుష్య కారకాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.వాహనాల పొగ, పంట వ్యర్థాల దహనం, బాణసంచా కాల్చడం, పారిశ్రామిక ఉద్గారాలు ఢిల్లీ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు కేంద్రం బహుముఖ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రం కఠిన చర్యలకు సిద్ధమైంది. గాలి కాలుష్య నియంత్రణ పరికరాలు (ఏపీసీడీలు) ఏర్పాటు చేయని 191 పరిశ్రమలను మూసివేయాలని సీపీసీబీ ఆదేశించింది. మొత్తం 2,345 పరిశ్రమలను లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 2,298 పరిశ్రమలను ఆన్‌లైన్ నిరంతర ఉద్గారాల పర్యవేక్షణ వ్యవస్థ (ఓసీఈఎంఎస్)కు అనుసంధానించారు. మిగిలిన 47 పరిశ్రమలను ఇప్పటికే మూసివేయడం లేదా సీజ్ చేయడం జరిగింది.

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త సారథి.. మీనాక్షి స్థానంలో బీఎం సందీప్



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వ్యవహారాల ఇన్‌చార్జిగా బీఎం సందీప్‌ను నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న మీనాక్షి నటరాజన్ స్థానంలో సందీప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఏఐసీసీ స్పష్టం చేసింది.కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన సందీప్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. మీనాక్షి నటరాజన్ పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి విశేష కృషి చేశారని, సందీప్ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని చిక్‌మగళూరుకు చెందిన బీఎం సందీప్‌కు ఎన్నికల వ్యూహకర్తగా మంచి పేరుంది. యూత్ కాంగ్రెస్‌లో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, చిక్‌మగళూరు మునిసిపల్ కౌన్సిలర్‌గా కూడా పనిచేశారు.

విద్యార్థుల పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం

150 రోజుల ఆందోళనకు ఫలితం.. జీవో 157తో సవరణలు

విద్యార్థులపై లాఠీచార్జీలు, కేసులపై సీఎం క్షమాపణ చెప్పాలి

అక్రమ కేసులు ఎత్తివేయాలి..

గాయపడిన వారికి పరిహారం ఇవ్వాలి

పూర్తికాల విద్యాశాఖ మంత్రిని నియమించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ డిమాండ్



సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల.. కుమార్తె వివాహానికి ఆహ్వానం



సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసిన ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన షర్మిల

కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరినట్లు సోషల్ మీడియాలో పోస్ట్

ఇప్పటికే పలువురు కీలక రాజకీయ ప్రముఖులను స్వయంగా ఆహ్వానించిన షర్మిల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్వయంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆమె, పెళ్లి కార్డును అందించి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా తన కుమార్తె అంజిలి రెడ్డి, కాబోయే అల్లుడు సోమల రఘురామ్ రెడ్డిల వివాహానికి సంబంధించిన వివరాలను చంద్రబాబుకు షర్మిల వివరించారు. పెళ్లికి తప్పనిసరిగా విచ్చేయాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం వైఎస్ షర్మిల ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చంద్రబాబుకు వెడ్డింగ్ కార్డు అందజేస్తున్న ఫొటోను పోస్ట్ చేస్తూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని తన నివాసంలో కలిసి నా కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డి ల వివాహ మహోత్సవానికి విచ్చేసి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందించడం జరిగింది" అని పేర్కొన్నారు.

మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన పవన్ కల్యాణ్

శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మహిళా నేతలకు పార్టీ నాయకత్వం అవకాశం కల్పించింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణిని ఎంపిక చేశారు. అలాగే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేరును పవన్ కల్యాణ్ ఖరారు చేశారు.మున్సిపాలిటీల విషయానికి వస్తే, విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత బరిలో నిలవనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను పార్టీ నాయకత్వం ఖరారు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నేతలను బరిలోకి దించే క్రమంలో క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించి, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అధినేత పవన్ కల్యాణ్ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నాయి.

సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల.. కుమార్తె వివాహానికి ఆహ్వానం

కుమార్తె వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వైఎస్ షర్మిల.. రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులను స్వయంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఆమె వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. షర్మిల కుమార్తె వివాహం నవంబరు 25న జరగనుండగా, డిసెంబరు 5న రిసెప్షన్ నిర్వహించనున్నారు.

30 వేలకోట్లు కావాలి

రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరిన సీఎం రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయాన్ని వివరించి, రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని సీఎం కోరినట్లు సమాచారం.

సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులపై విజ్ఞప్తి నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. గోదావరి-కావేరీ నదుల అనుసంధాన ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని, ఈ ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో తెలంగాణకు 50 శాతం వాటా కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కూడా ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు:

తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

సోనియా పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్..

సోనియా గాంధీ పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్ గాంధీ కుటుంబం నుంచి వ్యక్తిగతంగా అందిన ఆహ్వానం ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశంపై రాజకీయ ఆసక్తి మేఘధాతు డ్యాంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చే యత్నం

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. ఢిల్లీలోని ఒక ప్రముఖ హోటల్‌లో జరగనున్న ఈ వేడుకలో విజయ్ పాల్గొంటున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మణికం ఠాగూర్ ధ్రువీకరించారు.ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ కుటుంబ సభ్యులతో పాటు పలువురు ముఖ్య ఆహ్వానితులు హాజరుకానున్నారు. సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ కూడా ముఖ్యమంత్రి విజయ్‌కు ఫోన్ చేసి వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో విజయ్ ఢిల్లీ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అయినప్పటికీ, ఈ పర్యటనలో ముఖ్యమంత్రి విజయ్ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ భేటీ జరిగితే, కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేఘధాతు డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు వాదనలను ఆయన మరోసారి వినిపించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతూ నవంబర్ 7న విజయ్ ఇప్పటికే ప్రధానికి లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందంటూ కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ ఢిల్లీకి వెళ్లడం ఇది మూడోసారి. గత పర్యటనల్లో ఆయన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సోనియా గాంధీ వంటి అగ్రనేతలతో భేటీ అయ్యారు.

మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ.. కూటమి జోరు

ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండంతో తెలుగుదేశం పార్టీ పలు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల జాబితాను అధికారికంగా ఖరారు చేసింది. కీలకమైన మంగళగిరి - తాడేపల్లి నగర పాలక సంస్థ (కార్పొరేషన్) మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలు పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది.

ఢిల్లీ కాలుష్యంపై కేంద్రం చర్యలు..

191 పరిశ్రమలకు మూసివేతకు నోటీసులు

పరిశ్రమల నుంచి వెలువడే పర్టిక్యులేట్ మ్యాటర్ ఉద్గారాలు ప్రతి ఘన మీటర్‌కు 50 మిల్లీగ్రాముల (50 ఎస్జీ/చీఎట) పరిమితిని మించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై మూసివేత, విద్యుత్ సరఫరా నిలిపివేత, సీలింగ్ వంటి చర్యలు తీసుకోనున్నారు.

అధికారులకూ బాధ్యతలు.. వారానికో నివేదిక

కాలుష్య నియంత్రణ చర్యల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కార్యదర్శి స్థాయి అధికారులను నియమించాలని సూచించింది. ఈ అధికారులు మూడు రాష్ట్రాల్లోని 15 నగరాల్లో కాలుష్య నియంత్రణ చర్యలను పర్యవేక్షించనున్నారు. ఇందులో హరియాణాలో ఏడు, ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, రాజస్థాన్‌లో నాలుగు నగరాలు ఉన్నాయి.అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ప్రతి వారం గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం)కు నివేదికలు సమర్పించాలి. బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యే అధికారులకు నోటీసులు జారీ చేయడంతోపాటు అవసరమైతే క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని సీఏక్యూఎంను ఆదేశించారు.

వాహనాల కాలుష్యానికి చెక్.. కొత్త కెమెరాలు

వాహనాల నుంచి వెలువడే పొగను నియంత్రించడంతోపాటు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కేంద్రం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాహనాల నంబర్ ప్లేట్లను ఆటోమేటిక్‌గా గుర్తించే ఏఎన్‌పీఆర్ (ూఫీ=) కెమెరాలను నవంబర్ 30లోగా ఏర్పాటు చేయాలని రవాణా శాఖలను ఆదేశించింది. గడువులోగా ఈ పని పూర్తి చేయకపోతే బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఢిల్లీలోని 154 సరిహద్దు ప్రవేశ మార్గాల వద్ద మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) వ్యవస్థలను డిసెంబర్ 31, 2026లోగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ)ని ఆదేశించింది. దీనివల్ల టోల్ పాయింట్ల వద్ద వాహనాలు బారులు తీరడం, ఎక్కువసేపు ఇంజిన్లు ఆన్‌లో ఉంచడం తగ్గుతుందని భావిస్తున్నారు. ఎన్‌సీఆర్ పరిధిలో గుర్తించిన 233 ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.పాత వాహనాల స్థానంలో తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే వాహనాలను ప్రవేశపెట్టడంపైనా దృష్టి సారించారు. పరివర్తన్ పథకాన్ని వేగవంతం చేసి, బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా లేని పాత ట్రక్కులు, బస్సుల స్థానంలో బీఎస్-6, సీఎన్‌జీ, విద్యుత్ వాహనాలను 2028 నాటికి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రోడ్లపై దుమ్ము.. నిర్మాణ పనులపైనా నిఘా

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రోడ్లపై పేరుకుపోతున్న దుమ్ము కూడా వాయు కాలుష్యానికి కారణమవుతోంది. మొత్తం 5,480 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 3,221 కిలోమీటర్ల మేర మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగవంతం చేయాలని కేంద్రం ఆదేశించింది. రోడ్లపై గుంతలు పూడ్చడం, దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లను మరమ్మతు చేయడం, రోడ్ల మధ్య విభజన ప్రాంతాలను నిర్వహించడం, రహదారుల అంచుల వరకు పక్కాగా నిర్మించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. యాంత్రిక రోడ్డు శుభ్రపరిచే యంత్రాలను పూర్తి సామర్థ్యంతో రోజుకు రెండు షిఫ్టుల్లో నడపాలని ఆదేశించింది. వీటి పనితీరును డిజిటల్ ట్రాకింగ్, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పర్యవేక్షణతో పరిశీలించనున్నారు. ఇందుకోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల (ఐసీసీసీ) సేవలను వినియోగించుకోనున్నారు.నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్మును నియంత్రించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌సీఆర్ పరిధిలో కొనసాగుతున్న 3,000కుపైగా నిర్మాణ ప్రదేశాల్లో ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్కడ దుమ్ము నియంత్రణ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించనున్నారు.

చెత్త నిర్వహణలో భారీ లోటు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ కూడా పెద్ద సమస్యగా మారింది. రోజుకు ఉత్పత్తి అవుతున్న చెత్తను ప్రాసెస్ చేసేందుకు అవసరమైన సామర్థ్యంలో 6,747 టన్నుల కొరత ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం, తగులబెట్టడాన్ని అరికట్టాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశారు.ఢిల్లీలోని ఓఖ్లా, ఘాజీపూర్, భల్స్వా, హరియాణాలోని బంధ్వారీ ప్రాంతాల్లో ఉన్న నాలుగు ప్రధాన చెత్త డంపింగ్ కేంద్రాల్లో పేరుకుపోయిన పాత వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. చెత్తను సేకరించడం, వేరు చేయడం, ప్రాసెస్ చేయడం వంటి వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

గ్రాప్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

వాయు కాలుష్యం తీవ్రతను బట్టి అమలు చేసే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ ((గ్రాప్) నిబంధనలను అన్ని ప్రభుత్వ విభాగాలు కచ్చితంగా పాటించాలని కేంద్రం ఆదేశించింది. ఢిల్లీలో ఇప్పటికే అమలు చేస్తున్న శీతాకాల కాలుష్య నియంత్రణ కార్యాచరణను ఎన్‌సీఆర్‌లోని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలని సూచించింది.ట్రాఫిక్ నిర్వహణ, రద్దీ తగ్గింపు, అవసరమైన చోట్ల ఇంటి నుంచే పనిచేసే విధానం (వర్క్ ఫ్రమ్ హోమ్), నిర్మాణ పనులపై ఆంక్షలు, చెత్తతోపాటు పంట వ్యర్థాలను బహిరంగంగా కాల్చకుండా నిరోధించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది.ఢిల్లీలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీఏక్యూఎం రూపొందించిన 'పవన్' డిజిటల్ వేదిక ద్వారా కాలుష్య నియంత్రణ చర్యలను పర్యవేక్షించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిబంధనల అమలును ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు.

రాష్ట్రాల మధ్య సమన్వయమే కీలకంఢిల్లీ ఒక్కటే కాలుష్యాన్ని నియంత్రిస్తే సమస్య పరిష్కారం కాదని కేంద్రం అభిప్రాయపడింది. హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం,

పంట వ్యర్థాల దహనం కూడా ఢిల్లీ గాలి నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల రాష్ట్రాల మధ్య సమన్వయం తప్పనిసరి. ప్రస్తుతం వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, మున్సిపల్ సంస్థల మధ్య సమన్వయ లోపం, పనుల్లో జాప్యం, పాత వాహనాల వినియోగం, చెత్త ప్రాసెసింగ్ సామర్థ్యం కొరత వంటి సమస్యలు కాలుష్య నియంత్రణకు ఆటంకంగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు సీఏక్యూఎంకు మరింత సమన్వయ, పర్యవేక్షణ అధికారాలు కల్పించాలని సూచించారు.శీతాకాలంలో కాలుష్యం పెరిగినప్పుడు మాత్రమే చర్యలు తీసుకోవడం కాకుండా.. ఏడాది పొడవునా గాలి నాణ్యతను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలని కేంద్రం దృష్టి సారించింది. ప్రజా రవాణాను విస్తరించడం, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించడం, పరిశ్రమల్లో ఆధునిక కాలుష్య నియంత్రణ సాంకేతికతను వినియోగించడం, చెత్తను శాస్త్రీయంగా నిర్వహించడం వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించింది.కాలుష్యానికి కారణమవుతున్న మూలాలను శాస్త్రీయంగా గుర్తించడం, ఎప్పటికప్పుడు ఉద్గారాలను పర్యవేక్షించడం, స్వతంత్ర తనిఖీలు నిర్వహించడం, నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయడం ద్వారా అధికారుల పనితీరుపై బాధ్యతను పెంచాలని పేర్కొంది.మొత్తంగా పరిశీలిస్తే..

ఢిల్లీ-ఎన్‌సీఆర్ కాలుష్య సమస్యకు తాత్కాలిక చర్యలు సరిపోవని కేంద్రం భావిస్తోంది. పరిశ్రమల నుంచి వాహనాల వరకు, రోడ్లపై దుమ్ము నుంచి చెత్త నిర్వహణ వరకు అన్ని రంగాల్లో సమగ్ర మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. రాష్ట్రాల మధ్య సమన్వయం, అధికారుల జవాబుదారీతనం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చర్యలు అమలైతేనే రాజధాని ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందే అవకాశం ఉంటుంది.

దూసుకొస్తున్న ఆక్వాన్ తుపాను..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా తెలుగు రాష్ట్రాలకు తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం క్రమంగా వాయుగుండంగా మారి, తుపానుగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపానుకు 'అక్వాన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ తుపాను ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణించి నవంబర్ 20 నాటికి ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా తుపాను ప్రభావం కనిపిస్తుందని అధికారులు తెలిపారు.

భారత మార్కెట్లలోకి మళ్లీ విదేశీ నిధుల ప్రవాహం..

నికర విక్రయదారులుగా ఉన్న విదేశీ ఇన్వెస్టర్లు, నవంబర్ ఆరంభం నుంచి నిరంతరాయంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ నెల 13వ తేదీ నాటికే ఏకంగా రూ.79,301 కోట్ల విలువైన భారతీయ ఈక్విటీలను కొనుగోలు చేశారు. ఈ జోరు ఇలాగే కొనసాగితే, నవంబర్ నెల మొత్తం మీద వచ్చే ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ పరిణామంపై జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వి.కె. విజయకుమార్ మాట్లాడుతూ, "అమెరికా కాంగ్రెషనల్ ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) స్టాక్స్‌లో అమ్మకాలకు దారితీసింది. డెమొక్రాట్లు ఏఐ వ్యయాలు, నియంత్రణలకు అనుకూలంగా ఉండటంతో... ఇన్వెస్టర్ల నిధులు ఏఐయేతర రంగాల వైపు తరలాయి. ఈ క్రమంలో మెరుగైన వృద్ధి అవకాశాలున్న భారత మార్కెట్ వైపు గ్లోబల్ నిధులు మళ్లాయి" అని వివరించారు. దీనికితోడు దేశీయ కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు మెరుగుపడటం మార్కెట్‌కు కలిసొచ్చింది. 2027 ఆర్థిక సంవత్సరానికి గాను నిఫ్టీ 50 దాదాపు 15 శాతం మేర ఆదాయ వృద్ధిని సాధించే అవకాశం కనిపిస్తోంది. అలాగే భారతీయ లార్జ్‌క్యాప్ షేర్ల విలువలు ఆకర్షణీయమైన స్థాయికి రావడం, రూపాయి మారకం విలువ స్థిరంగా ఉండటం కూడా విదేశీ ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలోని కీలక లార్జ్‌క్యాప్ షేర్లలో షార్ట్ కవరింగ్ జరగడం సూచీల ర్యాలీకి మద్దతుగా నిలిచింది. గత వారం ఎఫ్‌పీఐలు రూ.33,340 కోట్ల పెట్టుబడులు పెట్టగా, అంతకుముందు వారం సుమారు రూ.45,960 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. మరోవైపు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) మాత్రం వరుసగా రెండో వారం కూడా అమ్మకాలకే మొగ్గు చూపారు. గత వారంలోని నాలుగు ట్రేడింగ్ సెషన్లలోనూ డీఐఐలు రూ.24,190 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. డీఐఐల లాభాల స్వీకరణ మార్కెట్ ర్యాలీని కొంత నెమ్మదింపజేసినప్పటికీ, ఎఫ్‌పీఐల బలమైన కొనుగోళ్లు దేశీయ మార్కెట్లకు భారీ ఊతాన్ని ఇస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

కొండగట్టులో భారీ కుంభకోణం.. రూ.23 కోట్ల నిధులు గోల్‌మాల్?

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రూ.23 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆడిట్ నివేదికలో తేలగా, ఈ వ్యవహారంపై ఏళ్ల తరబడి విచారణ ముందుకు సాగకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.2013-14 నుంచి 2017-18 మధ్య కాలంలో జరిగిన ఆడిట్‌లో ఈ భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. తొలుత రూ.2.26 కోట్లుగా ఉన్న అభ్యంతరాలు, తదుపరి ఆడిట్‌లలో రూ.23 కోట్లకు చేరినట్లు తెలిసింది. హుండీ ద్వారా వచ్చిన దబ్బులు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం పూర్తిగా ఖజానాకు జమ కాలేదని, ప్రసాదాల తయారీకి కొనుగోలు చేసిన సరుకుల లెక్కల్లోనూ భారీ తేడాలు ఉన్నాయని ఆడిట్ విభాగం స్పష్టం చేసింది. ఈ నిధుల దుర్వినియోగానికి ఆలయ ఉద్యోగులే బాధ్యులని తేల్చి చెప్పింది. ఈ అక్రమాలపై విచారణ జరపాలని 2022లోనే అప్పటి ఆలయ ఈవో ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో వేములవాడ ఆలయ ఈవోను విచారణాధికారిగా నియమిస్తూ అదే ఏడాది ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. 2025లో మరోసారి ఆదేశాలు ఇచ్చినా, విచారణ మాత్రం అంగుళం కూడా ముందుకు కదలలేదు.

విద్యార్థుల పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం

పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 97ను సవరిస్తూ జీవో 157 జారీ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ స్పందించారు. ఇది ప్రభుత్వ దయ కాదని, విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలను మొదట్లో పట్టించుకోకుండా లాఠీచార్జీలు, అరెస్టులకు పాల్పడిన ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గక తప్పలేదని విమర్శించారు. విద్యార్థుల పోరాటానికి ఆయన అభినందనలు తెలిపారు.

150 రోజుల పోరాటం.. ప్రభుత్వ నిర్ణయంలో మార్పు

2026 జూన్ 16న జీవో 97 జారీ కాగా, నవంబర్ 13న జీవో 157 ద్వారా ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. ఈ కాలంలో పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని శ్రవణ్ పేర్కొన్నారు. ఈసెట్ లేటరల్ ఎంట్రీ, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) సర్టిఫికెట్లు, ఫీజులు, స్కాలర్‌షిప్పులపై సందిగ్ధత నెలకొందన్నారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్, నల్గొండ, మణుగూరు వరకు నిరసనలు, నిరాహార దీక్షలు, అరెస్టులు, లాఠీచార్జీలు జరిగిన తర్వాతే ప్రభుత్వం నిర్ణయాన్ని సవరించిందని విమర్శించారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఎస్యూ)తో పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నత విద్యాశాఖ పరిధిలో కొనసాగనున్నాయి. ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మాత్రం శక్తి శాఖ పరిధిలోనే ఉంటా

పులివీడు పంచాయతీ సర్పంచ్ బరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు మహిళలు నామినేషన్



పోరుమామిళ్ల, నవంబర్ 15 (నంది పత్రిక): మండలంలోని పులివీడు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు మహిళలు ఈరోజు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల అనంతరం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డిని ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాగార్జున రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి, రంగారెడ్డి, పోలిరెడ్డి, బాబు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కలరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా గంటేన రమాదేవి..

టీడీపీకి మద్దతుగా ఓటు వేయాలని విజ్ఞప్తి





పోరుమామిళ్ల నవంబర్ 15 (నంది పత్రిక):పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో అక్కలరెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా గంటేన రమాదేవి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగేందుకు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపి, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గంటేన రమాదేవిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మన ఓటు మన అభివృద్ధి కోసం.. మన గ్రామ ప్రగతి కోసం అంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

పెద్ద హరివనం కూటమి పరంగా టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా బిపి అయ్యమ్మ

సర్పంచ్ అభ్యర్థిగా బల పరుస్తూ నామినేషన్ వేయించిన ఏపీ స్టేట్ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప



నంది పత్రిక ఆదోని ప్రతినిధి రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికలు రావడంతో టిడిపి జనసేన బిజెపి కూటమి పరంగా కర్నూలు జిల్లా ఆదోని మండలం2 మేజర్ పంచాయతీ పెద్ద హరివాణం గ్రామంలో బిపి అయ్యమ్మ సర్పంచ్ అభ్యర్థిగా నువ్వు బలపరుస్తూ నామినేషన్ వేయడం జరిగింది తర్వాత దేవేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది అలాగే యువతకు ఉద్యోగాలు దొరుకుతాయి కూటమిపరంగా బిపి అయ్యమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి తోడుంటామని తెలిపినారు కుటుంబ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద హరివరం గ్రామంలో కోట్ల పైగా పనులు జరిగినాయి ముందు ఈ కూటమి అభ్యర్థిని గెలిపించుకుంటే మరెన్నో నిధులు తెచ్చి ఈ గ్రామాన్ని సస్యశ్యామలగా మారుస్తామని తెలిపినారు ఈ సర్పంచ్ అభ్యర్థిని బలపరచడానికి ఆమె సిరీ వారుజిల్లా టిడిపి ఉపాధ్యక్షులు బిపి బసవరాజు ఎంపీటీసీ రాజమ్మ సిరివారు కొట్టకల్ నాగప్ప బీపీ గాదిలింగ బిపి శివన్న బోయ లింగన్న హెచ్ నందిస్ జాల్వాడి ఆదెప్ప బీపీ అయ్యన్న మరియు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ

గతంలో డ్రైనేజీ కోసం స్థలం అడిగితే కోర్టుకెక్కిన వైనం.. ఇప్పుడు సర్కారు జాగాపై కన్ను

ప్రశ్నించిన విలేకరులపై దౌర్జన్యం.. ఫోటోలు తీస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న అక్రమార్కుడు

అధికారుల ఉదాసీనతపై మండిపడుతున్న పోరుమామిళ్ల పట్టణ ప్రజలు

పోరుమామిళ్ల నవంబర్ 15 (నంది పత్రిక): “కంచే చేను మేసినట్లు.. నిబంధనలను తుంగలో తొక్కుతూ సాగుతున్న ఈ కబ్జా పర్వానికి అడ్డుకట్ట వేసేదెవరు?“ అన్న ప్రశ్న ఇప్పుడు పోరుమామిళ్ల పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రి (గవర్నమెంట్ హాస్పిటల్) సమీపంలో, సామాన్య ప్రజలు నడవాల్సిన ఫుట్‌పాత్‌ను సైతం వదలకుండా ఓ వ్యక్తి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

గతంలో కోర్టుకు.. ఇప్పుడు కబ్జాకు!

ఈ అక్రమ నిర్మాణం వెనుక సదరు వ్యక్తి యొక్క ద్వంద్వ నీతిపై పట్టణ ప్రజలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ప్రజా అవసరాల నిమిత్తం మురుగునీటి కాలువ (డ్రైనేజీ) నిర్మాణం కోసం కొంత స్థలం కావాలని అధికారులు, స్థానికులు కోరినప్పుడు సదరు వ్యక్తి ససేమిరా అన్నాడు.పైగా ఆ స్థలం తనదంటూ ఏకంగా కోర్టు మెట్లు ఎక్కి అభివృద్ధి పనులకు అడ్డుపడ్డాడు.సొంత స్థలం విషయంలో అంత పట్టుదల చూపిన వ్యక్తి, నేడు ఏకంగా ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ భూమిని, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మాణాలు ఎలా చేపడుతున్నాడని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.తన స్థలం విషయంలో కోర్టుకు వెళ్లిన వ్యక్తికి, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసే హక్కు ఎవరిచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నించిన విలేకరులపై దౌర్జన్యం, బెదిరింపులు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వృద్ధులు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలిగేలా ఫుట్‌పాత్‌పై జరుగుతున్న ఈ నిర్మాణంపై సమాచారం అందుకున్న పలువురు స్థానిక విలేకరులు అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు నిర్మాణం చేపడుతున్నారని వారు సదరు వ్యక్తిని ప్రశ్నించారు.దీనితో సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరైన ఆ అక్రమార్కుడు, విలేకరులపై తీవ్ర స్థాయిలో దురుసుగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా తన మొబైల్ ఫోన్‌తో విలేకరుల ఫోటోలు, వీడియోలు తీస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశాడు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే పాత్రికేయులనే బెదిరించే స్థాయికి కబ్జాదారుడు తెగించడంపై జర్నలిస్ట్ సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.ప్రమాదకరంగా మారిన ఆసుపత్రి పరిసరాలుప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు, గర్భిణీలు, అత్యవసర చికిత్స కోసం వచ్చే వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి కట్టడాలు చేపట్టడం వల్ల పాదచారులు రోడ్డుపైకి రావాల్సి వస్తోంది.దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా, ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అధికారుల మౌనంపై అనుమానాలు

పట్టణం నడిబొడ్డున, అది కూడా ప్రభుత్వ ఆసుపత్రి పక్కనే పట్టపగలు ఇంత పెద్ద ఎత్తున ఫుట్‌పాత్ ఆక్రమణ జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ/మున్సిపల్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల ఉదాసీనత వల్లే కబ్జాదారులు ఇంతలా బరితెగిస్తున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. “చట్టం తన పని తాను చేసుకుపోకపోతే, అక్రమార్కుల ఆగడాలకు అంతే ఉండదు.“ ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఫుట్‌పాత్‌పై జరుగుతున్న ఆ అక్రమ నిర్మాణాన్ని తక్షణమే కూల్చివేసి, ప్రభుత్వ భూమిని కాపాడాలని, అలాగే విలేకరులపై దురుసుగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం.

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టు కోవాలి.



బేతంచెర్ల నవంబర్ 15 (నంది పత్రిక). కార్తీకమాసం ను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సంధ్యాల జిల్లా.బేతం చర్ల మండలం లోని కొలుముల పల్లె ,ముద్దవరం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేయడం జరిగింది. లిఒక జ్ఞాని అయినా ఒక అజ్ఞాని అయినా జీవించి ఉన్నప్పుడే శ్రద్ధత్ో్నాన్ని పొందాలి.అలాగే పొందిన జ్ఞానం తో యోగ సాధన చేసి ఆయువును సద్వినియోగం చేసుకోవాలి అనే ఉద్దేశంతో, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టు కోవాలి అన్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో అందరూ దీపాలు వెలిగించడంతో పాటు, అందులో ఇమిడి ఉన్న జ్ఞానం కూడా తెలుసుకోవాలి అన్నారు..

దీపం అంతరార్థం.ప్రమిద = మనిషి శరీరం మట్టి తో సమానం అని మట్టి ప్రమిద లను వాడే వారు... రెండు వత్తులు= జీవాత్మ ఆత్మ ల కలయిక కు గుర్తు.వత్తులు వెలిగించే నిప్పు = గురువు ఇచ్చే జ్ఞానాగ్ని కి గుర్తు. నూనె: మనిషి జీవితం నకు, జన్మ కు కారణమైన కర్మ ను నూనె గా పోల్చారు

దీపం వెలుగుట :- గురువు ఇచ్చిన జ్ఞానాగ్ని ఆరిపోకుండా వెలిగేలా ఉండాలి అంటే జీవుడు ఆత్మ తో యోగం అవ్వాలి... అందుకే రెండు వత్తులను పెన వేసి ఉంచుతారు...

రెండు వత్తులు కాలిపోవుట :- ప్రమిద లో నూనె అయిపోయి రెండు వత్తులు కాలి పోయినప్పుడు మట్టి ప్రమిదలను పారవేయాలి... అంటే మనిషి కి కర్మ అయిపోతే చనిపోతాడు ... అలాగే యోగ సాధన వలన యోగాగ్నిలో కర్మ కాలిపోతే జీవాత్మ మోక్షం పొందును...., మనిషి తల లో కర్మ అనే నూనె అయిపొతే ఇక జీవుడు ఆ శరీరం విడిచి పెట్టాలి. అపుడు ఆ దేహం లో ఇక జీవుడు లేదు అని మట్టి ప్రమిద లను మట్టి లో కలిపివేసేవారు.ఈ కార్యక్రమం లో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పి.పుల్లారెడ్డి పి.చిన్నపుల్లారెడ్డి,నాగమద్దిలేటి, నాగలక్షమ్మ, కృష్ణవేణి, మనోహర్ గిరినాయుడు, సురేఖ, అపర్ణ లు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో “పీజీఆర్ఎస్“ రద్దు

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఈ నెల 16వ తేదీతో పాటు డిసెంబర్ 3 వరకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ తాత్కాలిక నిలిపివేత



కడప బ్యూరో చీఫ్ వంబర్ 15 నంది పత్రిక: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, కడప కలెక్టరేట్‌లో నవంబర్ 16వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రోజువారీ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి డిసెంబర్ 3వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళి ముగిసే వరకు ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదులు, అర్జీల సమర్పణ కోసం నవంబర్ 16న కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.

పోరుమామిళ్లలో కబ్జాదారుడి బరితెగింపు..

ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణం!

వివాహ వేడుకలకు హాజరై వధూవరులకు ఆశీస్సులు అందించిన రెడ్యం సోదరులు



ఖాజీపేట, నంది పత్రిక నవంబర్ 15: ఖాజీపేట, మైదుకూరు మండలాల పరిధిలోని ఈర్ల, సంద్రపల్లె, ముడమాల కుటుంబాలకు చెందిన మూడు వివాహ వేడుకల్లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రెడ్యం సోదరులు పాల్గొన్నారు.ఖాజీపేట మండలం చెముళ్లపల్లె పంచాయతీ పరిధిలోని సంజీవనగరం గ్రామానికి చెందిన ఈర్ల చిన్న రమణయ్య చిన్న కుమారుడు వెంకటేష్, వెంకట స్వప్నల వివాహం వరుడి స్వగృహంలో జరిగింది. అలాగే కూనవారిపల్లె పంచాయతీ పరిధిలోని సీతానగరం గ్రామానికి చెందిన సంద్రపల్లె శ్రీనివాసులు ఏకైక కుమారుడు వెంకట సుబ్బయ్య, దివ్యల వివాహం వరుడి స్వగృహంలో జరిగింది. మైదుకూరు మండలం వరదాయపల్లె గ్రామానికి చెందిన ముడమాల వీరారెడ్డి పెద్ద కుమార్తె వినిత, వేణుగోపాల్ రెడ్డిల వివాహం చాపాడు మండలం అల్లాడుపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ మూడు వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, కేసీ కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం ఆదినారాయణ రెడ్డిలు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన దంపతులు కలకాలం అన్యోన్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఇండ్ల వారి గృహప్రవేశ వేడుకల్లో రెడ్య సోదరులు.



ఖాజీపేట నంది పత్రిక నవంబర్ 15 ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామంలో ఇండ్ల దర్మారెడ్డి కుటుంబం నూతన గృహ ప్రవేశం, శ్రీ సత్య నారాయణ వ్రతం జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి నేత కె.సి.కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైయస్సార్ సిపి నేత రెడ్యం ఆదినారాయణ రెడ్డిలు పాల్గొని... ఇండ్ల దర్మారెడ్డి కుటుంబం అత్యున్నత స్థాయికి చేరాలని అక్షింతలు చల్లి దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు రెడ్యం నాగేశ్వరరెడ్డి,ఇండ్ల వెంకటరెడ్డి, తుమ్మల రామకృష్ణారెడ్డి,గొడ్లవీటి సుబ్బరాయుడు, మునెల్లి సుబ్బరాయుడు, మునెల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభం కానున్న శ్రీ నాగనాదేశ్వర స్వామి అన్నదాన సత్రం



ఖాజీపేట, (నంది పత్రిక) నవంబర్ 15: ఖాజీపేట మండలంలోని ప్రసిద్ధ శ్రీ నాగనాదేశ్వర స్వామి ఆలయ కోన దిగువన నిర్మించిన శ్రీ నాగనాదేశ్వర అన్నదాన సత్రాన్ని నవంబర్ 16, సోమవారం కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఖాజీపేట వాకింగ్ బ్యాచ్ సభ్యులు దాతల సహకారంతో సుమారు రూ.35 లక్షల వ్యయంతో ఈ అన్నదాన సత్రాన్ని నిర్మించారు. కులమతాలకు అతీతంగా నిర్మించిన ఈ సత్రం అందరిదని, ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాదని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇక్కడ అన్నప్రసాదాన్ని స్వీకరించవచ్చని తెలిపారు. కార్తీకమాసంలోని నాలుగు సోమవారాల్లో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అన్నదాన కార్యక్రమాల వివరాలు: – మొదటి సోమవారం: ఎం. నవనీత్ రెడ్డి, ఎమ్మార్ఎఫ్ టైర్స్, కడప రెండవ సోమవారం: ఖాజీపేట వాకింగ్ బ్యాచ్ మరియు ఖాజీపేట మండల ప్రజల సహకారంతో.మూడవ సోమవారం: అంజనేయకొట్టాల గ్రామ ప్రజల ఆధ్వర్యంలో.– నాలుగవ సోమవారం: వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర స్టీల్స్ & సిమెంట్, **ఖాజీపేట.**ఈ సందర్భంగా నవంబర్ 16న నిర్వహించనున్న అన్నదాన సత్రం ప్రారంభోత్సవానికి భక్తులందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కార్తీకమాసంలోని నాలుగు సోమవారాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

రామదుర్గం టిడిపి అభ్యర్థి గా సోమశేఖర్ నాయుడు నామినేషన్



ఆదోని నంది పత్రిక ప్రతినిధి కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం లోని రామదుర్గం టిడిపి అభ్యర్థిగా బోయ సోమశేఖర్ నాయుడు నామినేషన్ వేశారు సోమశేఖర్ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ మా తండ్రి తిమ్మయ్య టిడిపి పార్టీలోనే ఉన్నారు మా అమ్మ బోయ లక్ష్మీదేవి 1999 సంవత్సరంలో సర్పంచ్ గా గెలవడం జరిగిందన్నారు . అలాగే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రామదుర్గం గ్రామంలో సుమారు 50 లక్షలతో సిసి రోడ్లు డ్రైనేజీలు అభివృద్ధి పనులు చేపట్టమన్నారు అలాగే 9,10 కాలువ డ్రైనేజీ, , రోడ్లు దాదాపు 30 లక్షలతో కాల్వ పనులు చేపట్టడం జరిగిందన్నారు.అలాగే ఒకసారి నాకు సర్పంచ్ గా మీ ఓటు వేసి గెలిపిస్తే నేను రామదుర్గం గ్రామానికి ఇంకా ఎంతో అభివృద్ధి చేయాలని నాలో ఉంది అన్నారు గ్రామంలో ఇంకా సిసి రోడ్లు డ్రైనేజ్ సమస్య లు ఉన్నాయి అవి కూడా నేను గెలిచిన వెంటనే పూర్తి చేస్తానని సోమశేఖర్ నాయుడు అన్నారు నిన్న మొన్నటి ఎంపిటిసి ఎన్నికలలో మేము టిడిపి అభ్యర్థిని బలపరిచిన అభ్యర్థి గెలిపించుకోవడం జరిగింది అన్నారు

నంద్యాల ఐఎంఏ సేవలు ప్రశంసనీయం





ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు
నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్షులు గా
డాక్టర్ పనిల్ కుమార్ ప్రమాణ స్వీకారం

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 15 (నంది పత్రిక) ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు అధికార పర్యటన, నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్షులుగా డాక్టర్ పనిల్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజుతో పాటు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ బాల మద్దయ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఐఎంఏ నంద్యాల నూతన అధ్యక్షులుగా డాక్టర్ పనిల్ కుమార్ తో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ లో 24 వేల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఐఎంఏ సభ్యులు సేవలు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100 బ్రాంచీలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నంద్యాల ఐఎంఏ రాష్ట్రంలోనే సేవా కార్యక్రమాలలో ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. ప్రభుత్వ వైద్యుల సమస్యలను, ప్రైవేట్ ఆస్పత్రుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం వివిధ సందర్భాల్లో అందజేశామని గుర్తు చేశారు. ఐఎంఏ నంద్యాల నూతన అధ్యక్షులు డాక్టర్ పనిల్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ ద్వారా ప్రజా ఆరోగ్య అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు తరచూ నిర్వహిస్తామని అన్నారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన అనేక కార్యక్రమాలు నిర్వహించారని ప్రశంసించారు. వైద్యులు వైద్యం అందించడంలో నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలని కోరుతూ, వైద్యులకు, రోగులకు మధ్య సరైన అవగాహనతో కూడిన సత్సంబంధాలు ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ,డాక్టర్ బాల మద్దయ్య,రాష్ట్ర ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవి సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు గా గత సంవత్సరం పని చేసిన డాక్టర్ శ్రీనివాసరావులను ఐఎంఏ నంద్యాల సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ బాల మద్దయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయి ప్రసాద్,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీ సౌజన్య,డాక్టర్ వసుధ, డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత లతోపాటు అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం

చైర్మన్ రమణయ్య





కడప నవంబర్ 15 (నంది పత్రిక రిపోర్టర్) ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప కెమిస్ట్రీ భవన్ లో ఆత్మీయ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరోగుల సమస్యను శ్రద్ధగా విని వారి రోగం నయానికి సరైన వైద్యుణ్ణి సూచించడ ములో ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. వై ఎస్ ఆర్ కడప జిల్లా ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం కడప నగరం లోని కెమిస్ట్రీ భవనము నందు ఆదివారం ఉదయం జరిగింది. సమావేశనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వుండే ఈ సెంటర్స్ నిర్వాహకులు తమ దగ్గరకు వచ్చే రోగుల జబ్బు నయం కావడానికి సరైన వైద్యుల పేరు సూచించిన మంచి పేరు తెచ్చుకోగలరన్నారు. వైద్య శాస్త్రములో భారతదేశ చరకుల చరక సంహిత శుశ్రుతుల గ్రంధాలే మార్గదర్శకమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సెంటర్స్ నిర్వాహకులు నైపుణ్య వైద్యుల వివరాలు తెలుసుకుంటూ వుండాలన్నారు. మారుమూల పల్లె ప్రాంత ప్రజలతో మమేకమై ప్రభుత్వము అందించే ఆరోగ్య పరమైన సౌకర్యాలు తదితరాలను వివరించిన ప్రజాభిమానం పొందగలరన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ హాస్పిటల్స్ వివరాలు ఏ హాస్పిటల్ ఎటువంటి నిపుణులు ఉన్నారో ఎప్పటికప్పుడు తాజా సమాచారం పొంది ఆ వివరాలు రోగులు వారి కుటుంబ సభ్యులతో పంచుకుంటే వారికీ చాలా సహాయం చేసిన వారే కాకుండా ప్రాణాపాయం నుంచి కాపాడిన వారు కాగలరన్నారు. గ్రామాలు బలంగా ఆరోగ్యంగా ఉన్ననాడు వ్యవసాయం అభివృద్ధి చెందు తుందన్నారు. దీని కారణంగా స్థూల స్వదేశీ ఉత్పత్తులు పెరిగి దేశ ప్రతిభ ప్రకాశిస్తుందన్నారు. వైద్య రంగములో మన ఋషి పరంపర నుంచి నేటి వరకు సాధించిన గొప్పతనాన్ని శంకర్ వివరించినప్పుడు నిర్వాహకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. చివర గా డాక్టర్ శంకర్ ను అసోసియేషన్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో ప్రధమ చికిత్స సంఘ చైర్మన్ ఏ.రమణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్ కొండారెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ పి వెంకటేశ్వర్లు, జి బ్రహ్మానందరెడ్డి, జనరల్ సెక్రెటరీ, ఏ చంద్రశేఖర్ సెక్రటరీస్, పి కృష్ణయ్య, జి పెద్ద రెడ్డప్ప, ఏ చంద్రశేఖర్ సలహాదారుడు వి. మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు, రవీంద్రబాబు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సమ్మాతగేరి సర్పంచ్ అభ్యర్థిగా గాదిలింగ నామినేషన్.

గ్రామ అభివృద్ధే లక్ష్యం.. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా.



ఆదోని నంది పత్రిక ప్రతినిధి వడగుంద మండలం సమ్మాతగేరి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గాదిలింగ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి, సీనియర్ న్యాయవాది బైటింటి లక్ష్మీకాంత్ పాల్గొని గాదిలింగకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాదిలింగ మాట్లాడుతూ.. సమ్మాతగేరి గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో సమ్మాతగేరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంచాయితీ ఎన్నికల సన్నద్ధత పై మంత్రి సమీక్ష



కొలిమిగుండ్ల నవంబర్ 15నందిపత్రిక గ్రామ పంచాయితీ ఎన్నికల సన్నద్ధత పై కొలిమిగుండ్ల మండల ఎన్ డి ఏ కూటమి ముఖ్య నాయకులతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు.కొలిమిగుండ్ల బెలుం గుహలు దగ్గర ఉన్న బృందావన కన్వెన్షన్ సెంటర్‌లో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయాన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని ప్రతి గ్రామ నాయకుడు అందుకు కృషి చేయాలని వారికీ సూచించారు.పంచాయతీ ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి అభ్యర్థులదే ఘనవిజయం.. మంత్రి ధీమాలివైసీపీ నుంచి పోటీ చేసేందుకు కనీసం అభ్యర్థులు కూడా ముందుకు రాని పరిస్థితి ఉందన్నారు.పంచాయతీ ఎన్నికలపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది సర్పంచి పదవులకు బహిరంగ వేలాలు, ఏకగ్రీవాల కోసం బెదిరింపులు అంటూ వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది వైసీపీ అధినేత జగన్ ఓటమిని అంగీకరించలేక కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని మంత్రి పిలుపునిచ్చారు



శ్రీఅహోబిలం నరసింహ స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 15 నంది పత్రిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాస నాయుడు దర్శించుకున్నారు, ఆదివారంనాడు అహోబిలం చేరుకున్న ఆయనకు పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు స్వాగతం పలికారు అనంతరం శ్రీ అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఆలయ మర్యాదలతో స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరంశ్రీ రామతీర్థ పుట్టాలమ్మ అమ్మవారును దర్శించుకున్నారు.స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఆర్ టి యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి కరుణానిధి మూర్తి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ధనుంజయ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై వి రమణయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎన్. ఎం. భాష, ఆళ్ళగడ్డ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు శ్రీనివాసులు, ప్రదీప్, మహేష్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత వాతావరణంలో తొలి రోజు నామినేషన్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి
సర్పంచ్ స్థానాలకు 285, వార్డు సభ్యులకు 281 దాఖలు
16, 17 తేదీల్లో కూడా నామినేషన్ల స్వీకరణ
అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు



కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 15 నంది పత్రిక జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.ఆదివారం జిల్లాలోని 13 మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 67 క్లస్టర్ నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి ఎలాంటి అవాంతరాలు లేకుండా నామినేషన్లను స్వీకరించినట్లు వెల్లడించారు. మొదటి రోజు మొత్తం 285 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానాలకు, 281 మంది అభ్యర్థులు వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగిందని, అన్ని కేంద్రాల్లో ఎన్నికల అధికారులు నిర్దేశిత నిబంధనల ప్రకారం నామినేషన్లను స్వీకరించినట్లు తెలిపారు.ఈ నెల 16, 17 తేదీల్లో కూడా నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్రాలకు రావాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, అభ్యర్థులు స్వేచ్ఛగా తమ నామినేషన్లు సమర్పించుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు.

బత్తలూరులో వైసిపి నుండి 30 కుటుంబాలు టిడిపిలో చేరిక

టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
పార్టీలు చేరిన వారందరికీ సముచిత గుర్తింపు గౌరవం కల్పిస్తాం
ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ





ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 15 నంది పత్రిక ఆళ్లగడ్డ మండలం బత్తుల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోరెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి పార్థసారధి రెడ్డి, శ్రీనివాసరెడ్డి హుస్సేన్ రెడ్డి ప్రతాపరెడ్డి సురేందర్‌రెడ్డి రాజగోపాల్ రెడ్డి లతోపాటు మొత్తం 30 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరారు ఆదివారం నాడు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో వారంతా తెలుగుదేశం పార్టీ చేరారు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు పార్టీలో చేరిన వారందరికీ సముజిత గుర్తింపు గౌరవం కల్పిస్తూ పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకాంక్షించారు



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

రంగసముద్రం సర్పంచ్ అభ్యర్థిగా దియ్యాల మంజుల నామినేషన్ దాఖలు

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడి



పోరుమామిళ్ల, నవంబర్ 15 (నంది పత్రిక):కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దియ్యాల మంజుల నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకొని సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన ఆమె, గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా దియ్యాల మంజుల మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడటం, అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు.సర్పంచ్ పదవి అంటే కేవలం హోదా మాత్రమే కాదని, అది గ్రామ ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యత అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. రంగసముద్రం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే తన సంకల్పమని దియ్యాల మంజుల స్పష్టం చేశారు. గ్రామ ప్రజల ఆదరాభిమానాలతో సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ పరిశీలించిన ఆర్డీఓ



బద్వేలు, నవంబర్ 15 (నంది పత్రిక)గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్ డి ఓ) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు, అధికారుల విధుల నిర్వహణను పరిశీలించారు.ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

తండ్రి ఆశయాలే లక్ష్యంగా రాజకీయ అరంగేట్రం.. నాగలకుంట్ల సర్పంచ్ బరిలో ముత్యాల లక్ష్మీదేవి!



పోరుమామిళ్ల, నవంబర్ 15:(నంది పత్రిక): తండ్రి ఆశయాలను నెరవేర్చడంతో పాటు గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ముత్యాల లక్ష్మీదేవి రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం నాగలకుంట్ల (సంచర్ల) గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి ఆమె పోటీ చేస్తున్నారు.తన తండ్రి అంబవరం వెంకటరెడ్డి రాజకీయ అభివృద్ధి ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో, భర్త ముత్యాల భాస్కర్ రెడ్డి ప్రోత్సాహం, ఆశీస్సులతో రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు. కుటుంబ సభ్యుల సహకారంతో ప్రజాసేవకు సిద్ధమయ్యారు. ఆమెకు అన్న డాక్టర్ అంబవరం కొండారెడ్డి, బావ ముత్యాల మాబురెడ్డి, తమ్ముడు జనార్దన్ రెడ్డి అండగా నిలుస్తూ ఎన్నికల ప్రచారంలో సహకరిస్తున్నారు.యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నాలుగు గ్రామాలకు చెందిన యువత, టీడీపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో సోమవారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు.తండ్రి ఆశయాలను నెరవేర్చడంతో పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నాగలకుంట్ల (సంచర్ల) గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పిస్తూ ముత్యాల లక్ష్మీదేవి ఎన్నికల బరిలోకి దిగడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా కాటసాని నిత్యావసర సరుకుల అందజేత



కర్నూల్ సిటీ నంది పత్రిక కల్లూరు అర్బన్ 34వ వార్డు కృష్ణానగర్‌లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు, జీవనోపాధి కోల్పోయిన అజయ్ కుమార్ కుటుంబానికి వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి మూడు బియ్యం బస్తాలతో పాటు వంట సామగ్రి, నిత్యావసర సరుకులను అందజేసి, అధైర్యపడవద్దని అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో 35వ వార్డు నాయకులు, మాజీ కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి , అచ్చిరెడ్డి , వెంకట సాయి కృష్ణ , సిద్ధు , నాగ కిరణ్ , గోవర్ధన్ , చంద్ర , నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల ప్రజలకు ముఖ్య గమనిక ప్రత్యేక రైలు సర్వీసు

నంద్యాల, నవంబర్ 14. నంది పత్రిక:భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో ఉంచుకుని, దక్షిణ తూర్పు రైల్వే వారు సంత్రాగచ్చి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించారు.ఈ ప్రత్యేక రైళ్లు నవంబర్ 17 నుండి 24, 2026 వరకు రెండు ట్రిప్పుల చొప్పున నడుస్తాయి.

రైళ్ల వివరాలు:

రైలు నం. 08031 సంత్రాగచ్చి నుండి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం

– బయలుదేరు: మంగళవారం, 17.11.2026

– సంత్రాగచ్చి నుండి మధ్యాహ్నం 12:40 గంటలకు బయలుదేరుతుంది.

– నంద్యాల చేరుకునే సమయం: బుధవారం మధ్యాహ్నం 2:45 గంటలకు.

– శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం చేరుకునే సమయం: బుధవారం రాత్రి 11:30 గంటలకు.

రైలు నం. 08032 శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుండి సంత్రాగచ్చి

– బయలుదేరు: బుధవారం, 18.11.2026

– శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుండి ఉదయం 8:00 గంటలకు బయలుదేరుతుంది.

– నంద్యాల చేరుకునే సమయం: గురువారం తెల్లవారుజామున 4:20 గంటలకు.

– సంత్రాగచ్చి చేరుకునే సమయం: గురువారం రాత్రి 11:00 గంటలకు.

నంద్యాల మీదుగా ప్రయాణించే ముఖ్యమైన రైలు సమయాలు:

రైలు నంబర్। స్టేషన్। రాక। బయలుదేరు

08031। నంద్యాల। 14:45। 14:50

08032। నంద్యాల। 04:20। 04:25ఈ ప్రత్యేక రైళ్లలో మొత్తం 23 ఐసీఎఫ్ కోచ్‌లు ఉంటాయి. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. కావున నంద్యాల పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు, ఇతర ప్రయాణికులు ఈ ప్రత్యేక రైలు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరడమైనది.గమనిక: రైళ్ల సమయాలు మరియు ప్రయాణ వివరాలను ప్రయాణానికి ముందు అధికారిక రైల్వే విచారణ ద్వారా నిర్ధారించుకోవాలి.

కొత్తూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 14 . (నంది పత్రిక):ఎంతో పురాతన విశిష్టతగల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వల్లి సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతి ఆదివారము రక్తదాన శిబిరం ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సత్యనారాయణ శర్మ స్వామి సహకారంతో నిర్వహించడం జరుగుతుందని రెడ్ క్రాస్ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు.మొదటి ఆదివారం సందర్భంగా కొత్తూరులో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నందు ఆలయ ప్రధాన అర్చకులను రెడ్ క్రాస్ సన్మానించడం జరిగింది, రక్తదాతలను ప్రశంస పత్రాలతో అభినందించడం జరిగింది .ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కర్నూల్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, కర్నూల్ రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు భీమాశంకర్ రెడ్డి, రక్తదాన శిబిరం సహాయకులు వనం మహేంద్ర, మసీదు సురేష, నంద్యాల రెడ్ క్రాస్ డి ఎఫ్ ఓ అబ్దుల్లా రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేగడగూడూరులో సర్పంచ్ అభ్యర్థి వంగాల పద్మావతమ్మ ముమ్మర ఎన్నికల ప్రచారం



వెలుగోడు, నవంబర్ 15 (నంది పత్రిక):వెలుగోడు మండల రేగడగూడూరు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని వంగాల పద్మావతమ్మ గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వంగాల వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అభ్యర్థిని వంగాల పద్మావతమ్మ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని, తనకు మద్దతు తెలపాలని కోరారు.“మన ప్రాంత అభివృద్ధే మా లక్ష్యం“ అనే నినాదంతో ప్రజల ముందుకు వెళ్తున్నామని, గ్రామ అభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రేగడగూడూరు గ్రామ ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎన్నికల షెడ్యూలులో మార్పులు

- ఎంపీడీఓ మేరీ

కొత్తపల్లి – నంది పత్రిక : గ్రామపంచాయతీలలో నిర్వహించే సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ లో మార్పులు ఎన్నికల కమిషన్ వేలువరించినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి దాసరి మేరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ ఎన్నికలు మండలంలో రెండో విడతగా ఈనెల 29న జరగాల్సి ఉండగా ఈ ఎన్నికలను మూడవ విడతలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ 19వ తేదీన వెలువడుతుందని తెలిపారు. 21 వ తేదీ నుండి 23వ తేదీ వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తారని, 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.25వ తేదీన తిరస్కరించిన నామినేషన్ పై అప్పీల్ ఉంటుందని, 26వ తేదీన అప్పీల్ లపై తీర్మానాలు ఉంటాయని వెల్లడించారు.27వ తేదీన తుది పోరులో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటన చేయనున్నట్లు వివరించారు. డిసెంబర్ నెల రెండవ తేదీన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని అదేరోజు మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు కార్యక్రమం, సాయంత్రం గెలిచిన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఆమె వెల్లడించారు

ప్రజారంజకంగా నామినేషన్ దాఖలు చేసిన మందాల శివారెడ్డి.



శిరివెళ్ల :–(నంది పత్రిక);–సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మరియు నీటి సంఘం మాజీ చైర్మన్ అయినటువంటి మందాల శివారెడ్డి దంపతులు రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రముఖులు మందాల శివారెడ్డి వెంట వచ్చి నామినేషన్ కార్యక్రమానికి మద్దతుగా కదలి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి మందాల శివారెడ్డి తోపాటు వార్డు మెంబర్లుగా నామినేషన్ వేసే అభ్యర్థులు సైతం ఆదివారమే నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గా పార్టీ లీడర్ గా మందాల శివారెడ్డి దంపతులు గ్రామంలో చేసిన అభివృద్ధి సంక్షేమం మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో నిరంతరం కృషి చేసిన మందాల శివారెడ్డి వెంట వీరారెడ్డి పల్లె గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నామినేషన్ కార్యక్రమానికి మద్దతుగా నిలిచినట్లు వైసిపి వర్గాలు పేర్కొన్నాయి.

శిరివెళ్ల సర్పంచ్ బరిలో జనసేన నేత పెసరాయి చాంద్ బాషా



శిరివెళ్ల: (నంది పత్రిక) సిరివెళ్ల మండల కేంద్రము మేజర్ గ్రామ పంచాయతీ అయినా సిరివెళ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెసరాయి చాంద్ బాషా రంగంలో దిగడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం పార్టీ అధిష్టానం ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం రేపు లేదా ఎల్లుండి నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సౌమ్యుడు ప్రజా సమస్యలపై అవగాహన గల వ్యక్తిగా నీతి నిజాయితీకి నిలువదట్టం పెసరాయి చాంద్ బాషా గారు సర్పంచ్ బరిలో ఉంటే బాగుంటుందని పలు గ్రామస్తులు చెబుతున్నారు.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాను పలు ఉత్తమ అవార్డులు వచ్చిన విషయం మనందరికీ తెలిసిన విషయమే అలాంటి పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన స్థానిక సంస్థల్లో భాగమైన గ్రామ పంచాయతీలు రూపు రేఖలను మార్చే అవకాశం కల్పించాలంటే పెసరాయి చాంద్ బాషా గారు సర్పంచ్ ఎన్నికల్లో దిగాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.మొన్న జరిగిన ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల సమయంలో జనసేన పార్టీ తరపున శిరివెళ్ల మండలం జడ్పిటిసి గా పోటీకి దిగి కూటమి సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా పొత్తు ధర్మంలో భాగంగా కూటమి పెద్దలు సూచన మేరకు టిడిపి కోసం ఆయన జెడ్పీటీసీ అభ్యర్థిత్వం త్యాగం చేసిన విషయం తెలిసిందే... ఏది ఏమైనా జనసేన పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఆళ్లగడ్డ జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లా రెడ్డి, ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి గారి ఆశీస్సులతో సర్పంచ్ బరిలో దిగడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

క్రీడా పోటీలను ప్రారంభించిన ఇందిరమ్మ



కోయిలకుంట్ల నవంబర్ 15నంది పత్రిక పట్టణంలోని ఏ.ఎన్.కె. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్, త్రోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ చైర్మన్ గాలే సాహెబ్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి వచ్చిన ఆమె , పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

బనగానపల్లె నవంబర్ 15 నంది పత్రిక బనగానపల్లె పట్టణం విద్యుత్ కార్యాలయ సమీపంలో ఆదివారం మధ్యా హ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్య కుమార్ అనే తొమ్మిదవ తరగతి విద్యార్థి దుర్మరణం చెందాడు. స్కూటర్పై వస్తున్న విద్యార్థి తన వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. తీవ్ర రక్త గాయాల పాలైన విద్యార్థిని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బొల్లవరం టీడీపీలో చిచ్చు



- పార్టీని నమ్ముకున్న వాళ్ళని కాదని ఇతరులకు ప్రాధాన్యం

- పెరిగిపోతున్న అసంతృప్తులు

- మారుతున్న రాజకీయ సమీకరణాలు!

నంది పత్రిక కర్నూలు బ్యూరో : నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బొల్లవరంలో టిడిపి బీటలు వారుతోందా.. గ్రామంలో అసంతృప్తి జ్వాలలు ఎగిసి పడుతున్నాయా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలైనప్పటి నుంచి గ్రామంలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. పార్టీని నమ్ముకున్న వాళ్ళను కాదని ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయం కోసం గ్రామంలో కుట్ర రాజకీయాలకు తెర లేపారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యే స్థాయి లాంటి నాయకులు స్పందిస్తే గాని ఇక్కడ పరిస్థితి అధికార పార్టీకి అనుకూలంగా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి నాయకులు స్పందించకపోతే ఇప్పటికే ఎంపీటీసీ ఎన్నికల్లో ఆ గ్రామం నుంచి ఘోర ఓటమిపాలు చవిచూసిన టిడిపికి మరో ఎదురు దెబ్బ తగలక మానదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో అధిక మెజార్టీ అందించిన గ్రామం

నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామం ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి భారీ మెజారిటీ అందించి పార్టీ విజయానికి అండగా నిలిచిన ఈ గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకప్పుడు పార్టీకి గట్టి మద్దతుగా నిలిచిన గ్రామంలో ఇప్పుడు పరిస్థితులు మారడానికి కారణాలేమిటన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.గ్రామంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు స్థానిక నాయకత్వంలో సమన్వయ లోపం కనిపిస్తోంది. దీంతో పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోంది. అభ్యర్థుల ఎంపికలో తీసుకున్న నిర్ణయాలు పార్టీపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

40 ఏళ్లుగా జెండాను నమ్ముకొని పని చేస్తే...

సుమారు 40 ఏళ్లుగా పార్టీ జెండాను మోసి, పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న పాతతరం కార్యకర్తల మనోభావాలను నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బొల్లవరం గ్రామానికి చెందిన రాముడు 40 వేలుగా పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. ప్రస్తుతం బూత లెవెల్ ఇన్చార్జిగా కూడా ఉన్నారు. ప్రస్తుతం బొల్లవరం గ్రామ సర్పంచి స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడంతో బోరెల్లి రాముడు టిడిపి సానుభూతిపరుడిగా బరిలో నిలవాలని భావించారు. గ్రామంలో వీరి ఓటు బ్యాంకు కూడా అధికంగానే ఉంది. గెలుపు ఓటములను ప్రభావితం చేసే బలం వీరికి ఉంది. అలాంటి బోరెల్లి రాముడును కాదని స్థానిక టిడిపి నాయకుడు తమ చెప్పు చేతుల్లో ఉండే వ్యక్తులను సర్పంచ్ గా నిలబెట్టాలని నియోచిస్తున్నాడు. దీంతో ఇక్కడే గ్రామంలో అసలు రాజకీయం మొదలైంది.

పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని వ్యక్తిని ముందుకు తెచ్చి.

ప్రస్తుత నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఉన్న, బొల్లవరం గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న బోరెల్లి రాముడును గుర్తించకపోవడంతోనే ఇప్పుడు అసలు సమస్య మొదలైంది. ఏనాడు కూడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని వ్యక్తిని తీసుకొచ్చి సర్పంచ్ గా నిలబెట్టాలనుకోవడంతో బోరెల్లి రాముడు తో పాటు సర్పంచ్ గా నిలబడాలని అనుకున్న మరో ఇద్దరు కూడా అసంతృప్తితో రగిలిపోతున్నారు. వీరందరూ కూడా పార్టీ కార్యక్రమంలో సురుకుగా పాల్గొని ఎంపీ ఎమ్మెల్యే ఎన్నికలప్పుడు గ్రామంలో అత్యధిక మెజార్టీ రావడానికి కృషి చేశారు. అలాంటి వారిని కాదని ప్రసాద్ రెడ్డి అని నాయకుడు తమ చెప్పు చేతుల్లో ఉండే వ్యక్తిని తీసుకొచ్చి సర్పంచ్ గా నిలబెట్టాలని చూడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎంపీటీసీ ఓడిపోయినా మారని తీరు..

గ్రామంలో ఇప్పటికే ఎంపీటీసీ స్థానాన్ని కోల్పోయారు. కేవలం తన ఇంట్లో పనిచేసే జీతగానికి టికెట్ ఇచ్చుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలు కూడా వినిపించాయి. ఇప్పుడు తిరిగి సర్పంచ్ స్థానానికి కూడా అదే పరిస్థితి ఆనందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయినప్పటికీ ప్రసాద్ రెడ్డి తన పంధా మార్చుకోకుండా తనకు అనుకూలంగా ఉండి, తాను చెప్పినట్టు నడుచుకునే వ్యక్తినే సర్పంచ్ గా నిలబెట్టాలనుకోవడంపై చర్చగా మారింది. అది కూడా ఎలాంటి రాజకీయ పరిణతి లేని వ్యక్తు తెచ్చి టిడిపి సర్పంచ్ గా నిలబెట్టాలనుకోవడం దారుణమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

సొంతంగా నామినేషన్ వేసేందుకు రెడీ..

ప్రస్తుత రాజకీయ సమీకరణల నేపథ్యంలో బోరెల్లి రాముడు సొంతంగా నామినేషన్ వేసేందుకు రెడీ అవుతున్నారు. ఇలా చేయడం వల్ల టీడీపీకే భారీగా దెబ్బ పడే అవకాశం ఉంది. మొదటినుంచి టిడిపిలోనే ఉన్నాడు కాబట్టి ఆ పార్టీ ఓట్లే చీలే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఓవైపు వైసీపీ నుంచి బోరెల్లి రాముడుకు ఆహ్వానం ఉన్నా సొంతంగానే నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి గ్రామంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. పార్టీ కోసం పనిచేసిన నాయకులను గుర్తించాల్సిన అవసరం అంతకన్నా ఎక్కువ ఉంది.



విగ్రహ ప్రతిష్టకు ఆర్థిక సహాయం



కొత్తపల్లి – నంది పత్రిక : మండలంలోని నందికుంట గ్రామంలో దాతల సహకారంతో ఛాయా మల్లేశ్వర స్వామి ఆలయ నిర్మాణం జరిగింది. ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఛాయా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన రెడ్డి గారి రవీంద్రారెడ్డి విగ్రహ ప్రతిష్ట కోసం రూ.40116 లు ఆర్థిక సహాయాన్ని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పెద్ద రంగారెడ్డి, నారాయణరెడ్డి లకు అందజేశారు. ఛాయా మల్లేశ్వర స్వామి ప్రతిష్ట, నూతన ఆలయము, శిఖర, ధ్వజ ప్రతిష్ట, నాభి శిలా ప్రతిష్ట మహోత్సవములకు తమవంతుగా ఆర్థిక సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

వైఎస్ఆర్సిపి-జీనపల్లె సర్పంచ్ అభ్యర్థిగా : షేక్ పెద్దదస్తగిరి నామినేషన్:



శిరివెళ్ళ:-(నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని జీనేపల్లె గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్ఆర్సీపీ తరఫున షేక్ పెద్దదస్తగిరి ఆదివారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. యర్రగుంట్ల గ్రామ సచివాలయంలో వార్డు మెంబర్లతో కలిసి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కైప రఘునాథరెడ్డి, చీమల రమేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే దేయ్యమని, గ్రామ ప్రజలంతా షేక్ పెద్ద దస్తగిరి వెంట ఉన్నారని, ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, వార్డు సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

వేలంపాటల రాజకీయ సంస్కృతికి చంద్రబాబే ఆద్యుడు!

పరిషత్, మున్సిపల్ ఎన్నికల నుంచి గ్రామపంచాయతీ వరకు డబ్బు, ప్రలోభాల పర్వం

బెదిరింపులు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం

ప్రజాప్రతినిధుల పదవులను వేలంపాటలుగా మార్చే రాజకీయాలకు చరమగీతం పాడాలి

స్వేచ్ఛాయుత ఎన్నికల గురించి మాట్లాడే నైతిక అర్హత చంద్రబాబు కోల్పోయారు

ప్రలోభాలు, బెదిరింపుల రాజకీయాలను ప్రజలు ప్రతిఘటించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

కర్నూల్ సిటీ నంది పత్రిక గ్రామపంచాయతీ ఎన్నికల నుంచి పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వరకు ప్రజాస్వామ్య వ్యవస్థను డబ్బుతో కొనుగోలు చేసే నీచమైన రాజకీయ సంస్కృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆద్యుడిగా మారారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈవీఎంలైనా, బ్యాలెట్ ఎన్నికలైనా, పంచాయతీ ఎన్నికలైనా, పరిషత్, మున్సిపల్ ఎన్నికలైనా మనమే కొనుగోలు చేయాలి, మనమే గెలవాలి, మనమే అధికారంలో ఉండాలనే ధోరణితో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంపై ఆయనకున్న అసలు వైఖరిని బయటపెడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబూ ప్రజాస్వామ్యం అంటే ప్రజల మద్దతుతో ఎన్నికల్లో గెలవడం. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన అభ్యర్థిని స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించడం. కానీ మీ పాలనలో ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే ప్రజాస్వామ్య ప్రక్రియగా కాకుండా, డబ్బున్నవారు రాజకీయ పదవులను కొనుగోలు చేసే బహిరంగ మార్కెట్‌గా మారుతున్నాయని ఈశ్వరయ్య విమర్శించారు. గ్రామాల్లో సర్పంచి పదవులను ఏకగ్రీవాల పేరుతో రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకు వేలం వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఇది ఏకగ్రీవం కాదని, ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా ఖూనీ చేయడమేనని స్పష్టం చేశారు. ఈ వేలంపాటల సంస్కృతి గ్రామపంచాయతీలకే పరిమితం కాకుండా మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ స్థాయిలకూ విస్తరిస్తోందని అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు కోటి రూపాయల వరకు, మున్సిపల్ వార్డు పదవులకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు, కార్పొరేటర్ పదవులకు రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు వెచ్చించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి కనీసం రూ.10 కోట్లు, ఎంపీపీ పదవికి రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోందన్నారు. ఇవి కేవలం ఎన్నికల ఖర్చులు కావని, ప్రజాస్వామ్యాన్ని డబ్బుతో కొనుగోలు చేసే రాజకీయ వ్యాపారానికి, ప్రజాప్రతినిధుల పదవులను ఆర్థిక లావాదేవీలుగా మార్చే వికృత ధోరణికి నిదర్శనమని విమర్శించారు.ఒక గ్రామంలో సర్పంచి పదవిని రూ.రెండు కోట్లకు కొనుగోలు చేసిన వ్యక్తి ప్రజలకు సేవ చేస్తారా? లేక ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టుకునేందుకు గ్రామంలోని ప్రభుత్వ నిధులను, అభివృద్ధి పనులను వ్యాపార మార్గాలుగా మార్చుకుంటారా? అని ప్రశ్నించారు. అలాగే రూ.10 కోట్లు ఖర్చు చేసి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని పొందిన వ్యక్తి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తారా? లేక రాజకీయ పెట్టుబడిపై లాభాలు ఆర్జించేందుకు ప్రయత్నిస్తారా? అని నిలదీశారు. ప్రజాసేవను వ్యాపారంగా, రాజకీయ పదవులను పెట్టుబడులుగా మార్చే ఈ ప్రమాదకర సంస్కృతి రాష్ట్ర భవిష్యత్తుకు తీవ్ర విఘాతమని హెచ్చరించారు.గ్రామపంచాయతీల నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది పడుతుందని, అక్కడి నుంచే భవిష్యత్తు నాయకత్వం ఎదగాలని ఈశ్వరయ్య పేర్కొన్నారు. సామాన్య రైతు కుటుంబాలు, వ్యవసాయ కూలీల కుటుంబాలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజా సమస్యలపై పోరాడేందుకు స్థానిక సంస్థలు వేదికలుగా నిలవాలన్నారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడే నాయకులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండాలని, కోట్ల రూపాయలు ఖర్చు చేయగలిగిన వారికే పదవులు దక్కే పరిస్థితి కల్పిస్తే సామాన్యులకు రాజకీయాల్లో చోటు ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కొత్త తరం నాయకత్వం ఎలా ఎదుగుతుందని నిలదీశారు. సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన రాజకీయ ప్రవేశ మార్గాలను మీరే మూసివేస్తున్నారని విమర్శించారు.ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులను ఎన్నికల బరిలోకి రానీయకుండా అడ్డుకోవడం, అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం, డబ్బు ఆశ చూపి పోటీ నుంచి తప్పించడం వంటి చర్యలతో ఎన్నికల అసలు లక్ష్యాన్నే నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. గతంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న ఘటనలు, పోలీసు వ్యవస్థను అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారన్న ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు అదే రాజకీయ సంస్కృతిని వేలంపాటలు, ఏకగ్రీవాల రూపంలో గ్రామస్థాయికి విస్తరిస్తున్నారని విమర్శించారు. ఒకవైపు స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగాలని బహిరంగంగా ప్రకటిస్తూ, మరోవైపు మనమే ఎన్నికలను కొనుగోలు చేయాలి, మనమే గెలవాలి అంటూ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజల ఓట్లతో గెలవాల్సిన పదవులను డబ్బుతో కొనుగోలు చేయాలని ప్రోత్సహించే ధోరణికి ప్రజాస్వామ్యంలో ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాలకు గాను 164 స్థానాలు గెలుచుకున్నామని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబుకు ప్రజల మద్దతుపై నిజంగా నమ్మకం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణాన్ని ఎందుకు కల్పించడం లేదని ఈశ్వరయ్య ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జరగాల్సిన గ్రామపంచాయతీ ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్టకు సంబంధించిన అంశంగా ఎందుకు మార్చుతున్నారని నిలదీశారు. ప్రజల మద్దతుతో గెలవగలమనే విశ్వాసం ఉన్నప్పుడు డబ్బు, అధికార బలం, ప్రలోభాలు, బెదిరింపులపై ఆధారపడాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

ఈ వేలంపాటల సంస్కృతి ఒక్క టీడీపీకే పరిమితం కాకుండా ఇతర రాజకీయ పక్షాల్లోనూ పెరుగుతున్న ధోరణి ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదకరమని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ రాజకీయ కూటమి తన ప్రయోజనాల కోసం పనిచేసినా ప్రజల ఓటు హక్కును డబ్బుతో కొలిచే విధానాన్ని ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. రాజకీయ పదవులు ప్రజల విశ్వాసంతో, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ద్వారా దక్కాలే తప్ప, వేలంపాటల్లో అత్యధిక ధర చెల్లించిన వారికి కట్టబెట్టే పరిస్థితి ఉండకూడదన్నారు.

గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, ఉపాధి, రైతాంగ సమస్యలను పరిష్కరించాల్సిన స్థానిక సంస్థలను రాజకీయ పెట్టుబడుల కేంద్రాలుగా మార్చడం వల్ల ప్రజాధనం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్నికల్లో పెట్టిన కోట్ల రూపాయల పెట్టుబడిని తిరిగి సంపాదించుకోవాలనే లక్ష్యంతో అభివృద్ధి నిధుల వినియోగంలో కమీషన్లు, అవినీతి, కాంట్రాక్టుల దోపిడీ పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు రాజకీయ నాయకుల ఆర్థిక ప్రయోజనాలకు మళ్లితే గ్రామీణాభివృద్ధి పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. చివరకు నష్టపోయేది గ్రామీణ ప్రజలు, పేదలు, సామాన్య ప్రజానీకమేనని స్పష్టం చేశారు. చంద్రబాబూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, స్వేచ్ఛాయుత ఎన్నికల గురించి మాట్లాడే ముందు మీ పాలనలో పెరిగిపోతున్న ఈ వేలంపాటల రాజకీయ సంస్కృతికి సమాధానం చెప్పాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రజల తీర్పును గౌరవించకుండా, రాజకీయ పదవులను డబ్బుతో కొనుగోలు చేసే విధానాన్ని ప్రోత్సహిస్తూ స్వేచ్ఛాయుత ఎన్నికల గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన ఈ రాజకీయ ధోరణిని కొనసాగిస్తూ స్వేచ్ఛాయుత ఎన్నికల గురించి మాట్లాడే నైతిక అర్హతను చంద్రబాబు కోల్పోయారని విమర్శించారు.గ్రామపంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికల వ్యవస్థను పరిరక్షించడం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యతని ఈశ్వరయ్య పేర్కొన్నారు. వేలంపాటల సంస్కృతిని, ప్రలోభాల రాజకీయాలను, బెదిరింపులను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏకగ్రీవాల పేరుతో జరిగే వేలంపాటలను అరికట్టాలి, ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి పౌరుడి హక్కును కాపాడాలి, ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం, ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలి అని డిమాండ్ చేశారు.

ప్రజల ఓట్లతో గెలిచిన వారికే రాజకీయ పదవులు దక్కాలి తప్ప, డబ్బుతో పదవులను కొనుగోలు చేసే రాజకీయ వ్యాపార సంస్కృతికి చరమగీతం పాడాలని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యావంతులు, యువతకు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.



ఎన్నికల సమరానికి ముందే వైఎస్ఆర్సీపీకి భారీ బలం..

బస్తీపాడులో టీడీపీ శ్రేణులు కాటసాని రామభూపాల్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సీపీలోకి చేరికలు

బస్తీపాడులో టీడీపీకి భారీ షాక్.. వైఎస్ఆర్సీపీలోకి 100 మంది చేరిక



కర్నూల్ సిటీ నంది పత్రిక కల్లూరు మండలం బస్తీపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్సీపీ ప్రజా ఉద్యమానికి ఆకర్షితులై వైఎస్ఆర్సీపీలో చేరారు. గ్రామ నాయకులు కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కల్లా వెంకటరమణారెడ్డి, కల్లా మహేశ్వర్ రెడ్డి గార్ల ఆధ్వర్యంలో జి. విష్ణువర్ధన్ రెడ్డి, బి. కృష్ణారెడ్డి, బి. రేవనాథ్ రెడ్డి, అరెపల్లె శేషిరెడ్డి, బోయ రామాంజనేయులు, బోయ శేఖర్, మాజీ సర్పంచ్ బోయ రవి, బోయ లక్ష్మన్న, బోయ రాంబాబు, బోయ సురేష్, పసుల ఓబులేష్, కురువ మధు, షేక్ ఈదురు భాష, బోయ మురళి తదితరులు సుమారు 100 మందితో కలిసి వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన వారికి వైఎస్ఆర్సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ..! టీడీపీ పాలనపై విసుగు.. వైఎస్ఆర్సీపీ నాయకత్వంపై నమ్మకం.. ప్రజా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో సాగుతున్న ప్రజా పోరాటానికి మద్దతుగా ప్రజలు వైఎస్ఆర్సీపీ వైపు అడుగులు వేస్తున్నారనడానికి బస్తీపాడు చేరికలే నిదర్శనం అని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి వైఎస్ఆర్సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కాటసాని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజల మద్దతుతో ఎన్నికల్లో ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీపాడు మరియు చిన్నకొట్టాల గ్రామాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా సాఫ్ట్ బాల్ కమిటీ

ఛైర్మెన్ గా కె శ్రీనాధ రెడ్డి, వైస్ ఛైర్మెన్ బ్రహ్మానందరెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 15, నంది పత్రిక నంద్యాల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఛైర్మెన్ గా కె. శ్రీనాధ రెడ్డి, కారస్పాండెంట్, విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆళ్లగడ్డ, వైస్ ఛైర్మెన్ గా ఎం వీ బ్రహ్మానంద రెడ్డి, అధ్యక్షులు గా విష్ణువర్ధనరెడ్డి, కార్యదర్శిగా ఉమాదేవి, కోశాధికారి సుబ్బారావు లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఆదివారం స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో నంద్యాల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం, అలాగే ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాఫ్ అబ్సర్వర్ గా డిఎస్ డిఓ ఎం ఎన్ వీ రాజు, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేషులు, కర్నూలు జిల్లా సెక్రెటరీ విజయ్ కుమార్ అబ్సర్వర్ లుగా హాజరయ్యారు. ఈ అబ్సర్వర్ ల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లాలో మొదటి విడతలో 90 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు





1,062 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 15 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆచంట, నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఐదు మండలాల్లో 90 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఆదివారం పెనుగొండ మండలంలోని పెనుగొండ, సిద్ధాంతం గ్రామ పంచాయతీలతో పాటు పెనుమంట్ర మండలంలోని ఆలమూరు గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఆచంట నియోజకవర్గ పరిధిలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాలతో పాటు నరసాపురం నియోజకవర్గ పరిధిలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మొత్తం 90 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.మొత్తం 1,006 వార్డులకు సంబంధించి 1,062 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా ప్రతి నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచుతూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు .ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు .ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు కె. కృష్ణయ్య, ఉంగరాల నాగేశ్వరరావు, తహసీల్దార్లు జి. అనిత కుమారి, టి రాజరాజేశ్వరి,ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





పంచాయతీ ఎన్నికలకు సజావుగా నామినేషన్ల ప్రక్రియ

- ఈ నెల 26న 73 గ్రామ పంచాయతీలు, 856 వార్డులకు తొలిదశ ఎన్నికలు

- సజావుగా కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

- విజయవంతంగా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ బ్యూరో చీఫ్ నవంబర్ 15 నంది పత్రిక గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా జిల్లాలో తొలిదశలో ఈ నెల 26న 73 గ్రామ పంచాయతీల్లో 856 వార్డులకు 1,001 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని..

ఇందుకు సంబంధించి ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన తొలిదశలో విజయవాడ రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జి.కొండూరు మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో 224 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఇదేవిధంగా ఇబ్రహీంపట్నం మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో 116 వార్డులకు, మైలవరం మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో 154 వార్డులకు, విజయవాడ గ్రామీణ మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో 226 వార్డులకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. తిరువూరు రెవెన్యూ డివిజన్ రెడ్డిగూడెం మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో 136 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. పోలింగ్ రోజునే ఫలితాల వెల్లడికి కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు:

పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికార యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించడంతో పాటు, పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని.. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు, అక్రమ నగదు, మద్యం పంపిణీ వంటి వాటిపై నిరంతర నిఘా ఉంచుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు, సమాజ అభ్యున్నతికి బిర్సా ముండా చేసిన సేవలు చిరస్మరణీయం

ఘనంగా ధర్తీ ఆబా బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు

బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



విజయవాడ బ్యూరో చీఫ్: నవంబర్ 15, నంది పత్రిక స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్య దైవం, 'ధర్తీ ఆబా'గా ప్రసిద్ధి చెందిన భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఆదివారం విజయవాడలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఇతర గిరిజన నాయకులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడిగా బిర్సా ముండా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఈ సందర్భంగా కొనియాడారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గిరిజన సమాజ అభ్యున్నతి, సామాజిక చైతన్యం కోసం ఆయన అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు.

ప్రధానమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం వీక్షణఅనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు, విద్యార్థినులు వీక్షించారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వి.శ్రీను, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పి.జ్యోతి లక్ష్మి దేవి, కార్యాలయ సిబ్బంది, వసతి గృహ సంక్షేమ అధికారి డి.ప్రతిభ, కళాశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అభినందనలు.

వెల్లటూరు, రాయనపాడు, కోడూరు గ్రామ పంచాయతీలకు కూటమి అభ్యర్థుల ఖరారు.

ఎన్టీఆర్ జిల్లా, గొల్లపూడి, బ్యూరో చీఫ్ నవంబరు 15 నంది పత్రిక: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులకు మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అభినందనలు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల మద్దతుతో ఎన్నికల్లో ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు.జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మందపాటి అర్జున్ రావు విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మందా రాణి జి.కొండూరు మండలం కోడూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముక్కమల మధుశ్రీ ఎన్డీఏ కూటమి బలపరిచింది.ఈ నేపథ్యంలో ముగ్గురు అభ్యర్థులు మందపాటి అర్జున్ రావు, మందా రాణి, ముక్కమల మధుశ్రీ ఆదివారం గొల్లపూడిలోని మైలవరం శాసనసభ్యుల కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముగ్గురు అభ్యర్థులను అభినందించి, ఎన్నికల్లో విజయధంకా మోగించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలుస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి నమ్మకాన్ని, ఆదరాభిమానాలను చూరగొనాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.గ్రామ పంచాయతీలే అభివృద్ధికి పునాదులని పేర్కొంటూ, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదుని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. ఎన్డీఏ కూటమి ఐక్యతను, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వెల్లటూరు, రాయనపాడు, కోడూరు గ్రామాల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు ఆకాంక్షించారు.



భారీగా తగ్గిన పసిడి.. 10 గ్రాముల ధర రూ.1.36 లక్షలకు డౌన్

దేశీయ కమోడిటీ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో ఈ వారం ముగిసే సమయానికి పసిడి, వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్టులు తీవ్ర నష్టాలను నమోదు చేశాయి. అమెరికా ట్రెజరీ బాండ్ ఈల్డ్స్ పెరగడం, డాలర్ బలపడటం, రానున్న రోజుల్లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత పెంచవచ్చనే సంకేతాలు మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి.

చిలకలూరిలో టిడిపిని వీడి 10 కుటుంబాలు వైసీపీలో చేరికలు



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 15 నంది పత్రిక రుద్రవరం మండలం, చిలకలూరు గ్రామానికి చెందిన ఈడిగ రాముడు, ఈడిగ శివ గౌడ్, రాజశేఖర్ గౌడ్, వడ్ల కిట్టుడు మరియు గోపవరం శేషా రెడ్డితో పాటు 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి వైసిపి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సురేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 15 నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణం రామాలయం వీధికి చెందిన ఆర్.ఐ ప్రభాకర్ కుమారుడు సురేష్ గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మృతుని నివాసానికి వెళ్లి సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ఎన్జీవోల సంఘం ఉపాధ్యక్షులు వంగాల దస్తగిరి రెడ్డి, జయ చంద్రారెడ్డి పలువురు నాయకులు తదితరులు మృతుడు సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.



ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం

చైర్మన్ రమణయ్య

కడప నవంబర్ 15 (నంది పత్రిక రిపోర్టర్) ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వై ఎస్ ఆర్ కడప జిల్లా ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం కడప నగరం లోని కెమిస్ట్రీ భవనము నందు ఆదివారం ఉదయం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వుండే ఈ సెంటర్స్ నిర్వాహకులు తమ దగ్గరకు వచ్చే రోగుల జబ్బు నయం కావడానికి సరైన వైద్యుల పేరు సూచించిన మంచి పేరు తెచ్చుకోగలరన్నారు. వైద్య శాస్త్రములో భారతదేశ చరకుల చరక సంహిత శుశృతుల గ్రంధాలే మార్గదర్శకమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సెంటర్స్ నిర్వాహకులు నైపుణ్య వైద్యుల వివరాలు తెలుసుకుంటూ వుండాలన్నారు. మారుమూల పల్లె ప్రాంత ప్రజలతో మమేకమై ప్రభుత్వము అందించే ఆరోగ్య పరమైన సౌకర్యాలు తదితరాలను వివరించిన ప్రజాభిమానం పొందగలరన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ హాస్పిటల్స్ వివరాలు ఏ హాస్పిటల్ ఎటువంటి నిపుణులు ఉన్నారో ఎప్పటికప్పుడు తాజా సమాచారం పొంది ఆ వివరాలు రోగులు వారి కుటుంబ సభ్యులతో పంచుకుంటే వారికీ చాలా సహాయం చేసిన వారే కాకుండా ప్రాణాపాయం నుంచి కాపాడిన వారు కాగలరన్నారు. గ్రామాలు బలంగా ఆరోగ్యంగా ఉన్ననాడు వ్యవసాయం అభివృద్ధి చెందు తుందన్నారు. దీని కారణంగా స్థూల స్వదేశీ ఉత్పత్తులు పెరిగి దేశ ప్రతిభ ప్రకాశిస్తుందన్నారు. వైద్య రంగములో మన ఋషి పరంపర నుంచి నేటి వరకు సాధించిన గొప్పతనాన్ని శంకర్ వివరించినప్పుడు నిర్వాహకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. చివర గా డాక్టర్ శంకర్ ను అసోసియేషన్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో ప్రధమ చికిత్స సంఘ చైర్మన్ ఏ.రమణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్ కొండారెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ పి వెంకటేశ్వర్లు, జి బ్రహ్మానందరెడ్డి, జనరల్ సెక్రెటరీ, ఏ చంద్రశేఖర్ సెక్రటరీస్, పి కృష్ణయ్య, జి పెద్ద రెడ్డప్ప, ఏ చంద్రశేఖర్ సలహాదారుడు వి. మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు, రవీంద్రబాబు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మైదుకూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ను కలిసిన పత్రికా ప్రతినిధి

వి మల్లికార్జునరావు



కడప నవంబర్ 15 (నంది పత్రిక రిపోర్టర్) దిన పత్రిక కడప బ్యూరో ఇంచార్జ్ మల్లికార్జున రావు, మైదుకూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పసుపులే టి శంకర్ ను మర్యాదపూ ర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు.

అయ్యప్ప భక్తులకు శుభవార్త.. హైదరాబాద్, ఏపీ నుంచి ప్రత్యేక రైళ్లు

శబరిమల అయ్యప్ప స్వామి మండల, మకరవిళక్కు పూజల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు అందించింది. తెలుగు రాష్ట్రాల నుంచి కేరళలోని కొల్లాంకు భారీగా తరలివెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, చర్లపల్లి, మచిలీపట్నం ప్రాంతాల నుంచి కొల్లాం వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది.

చర్లపల్లి కొల్లాం ప్రత్యేక రైళ్లు (07180 / 07181) చర్లపల్లి నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07180) నవంబర్ 20 నుంచి డిసెంబర్ 25 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11:45 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం చర్లపల్లి స్పెషల్ రైలు (నంబర్ 07181) నవంబర్ 22 నుంచి డిసెంబర్ 27 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10:40 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 7:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది.

"నీచ వ్యాఖ్యల పై మౌనమెందుకు - కాకాణి పూజిత"





నీచ వ్యాఖ్యలపై మౌనం వెనుక కారణమేంటి?

- మీ పేర్లు చెప్పుకుని తిడుతున్నా స్పందించరా

- మీ కార్యకర్తలను అదుపు చేయాల్సిన బాధ్యత మీది కాదా

కూటమి నేతలకు కాకాణి పూజిత సూటి ప్రశ్నలు

జనసేన కార్యకర్తల సైబర్ బుల్లీయింగ్ పై నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం అక్కడే మహిళా నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత

- వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై నీచ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా?

- రాజకీయాల్లో లేని మహిళలను తిడుతూ అవమానించడం మర్యాదా?

- మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటం అంటే ఇలాగేనా

- చంద్రబాబు, పవన్, లోకేష్, అనిత ఎందుకు మౌనంగా ఉన్నారు?

- సైకోల వ్యాఖ్యలను ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానం కలుగుతోంది

- జనసేన సైకో కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలి

: కాకాణి పూజిత డిమాండ్

నెల్లూరు బ్యూరో నవంబర్ 15 నంది పత్రిక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై జనసేన కార్యకర్తలు ఎక్స్ స్పేస్‌ల వేదికగా అత్యంత నీచమైన, సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత సహా కూటమి నాయకుల నుంచి కనీసం అవి తప్పు అనే ఒక్క ప్రకటన కూడా రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మహిళా నాయకులతో కలిసి నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆమె అక్కడే మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలను కూటమి నాయకులు సమర్థిస్తున్నారా? లేక వారి మౌనంతోనే ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం అత్యంత దారుణమని మండిపడ్డారు. సైబర్ బుల్లీయింగ్ అనేది చిన్న విషయం కాదని, మహిళలు, యువత, చిన్నారులు సైతం ఇలాంటి వేధింపుల కారణంగా తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన రాజకీయ పార్టీలు ఇలాంటి దాడులను అడ్డుకోవాల్సింది పోయి, తమ కార్యకర్తలతోనే చేయించడం ప్రజాస్వామ్యానికి, మహిళల గౌరవానికి విరుద్ధమని కాకాణి పూజిత పేర్కొన్నారు.

ఆమె ఇంకా ఏం మాట్లాడారంటే... రాజకీయ విమర్శలు చేస్తే స్వాగతిస్తాం: వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపై జనసేన కార్యకర్తలు ఎక్స్ స్పేస్‌లను నిర్వహించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు సంబంధించి పూర్తి ఆధారాలతో నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఈ స్పేస్‌లను నిర్వహించిన వ్యక్తులు ఎవరు, వాటిలో పాల్గొన్నవారు ఎవరు, ఏయే సందర్భాల్లో ఎలాంటి వ్యాఖ్యలు చేశారనే పూర్తి వివరాలను పోలీసులకు అందజేశాం. ఫిర్యాదును స్వీకరించి రసీదు ఇవ్వడం సానుకూల పరిణామంగా భావిస్తున్నాం. అయితే ఫిర్యాదు తీసుకోవడంతోనే సరిపెట్టకుండా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయాల్లో ఉన్న మహిళలను విమర్శించాలనుకుంటే రాజకీయ అంశాలపై విమర్శలు చేసుకోవచ్చు, అంతేకానీ రాజకీయాలతో సంబంధం లేని కుటుంబ సభ్యులను, మహిళలను వ్యక్తిగతంగా దూషించే హక్కు ఎవరికీ లేదు. ఇంట్లో కూర్చుని సోషల్ మీడియా వేదికగా ఎవరినైనా ఇష్టానుసారంగా దూషించవచ్చనే ధోరణి పెరిగితే రాబోయే తరాలకు మనం ఎలాంటి విలువలు నేర్పగలం? సైబర్ బుల్లీయింగ్ అనేది చాలా తీవ్రమైన నేరమని, ముఖ్యంగా మహిళలు, యువత, చిన్నారులు ఇలాంటి వేధింపుల వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఇలాంటి దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, పోలీసు వ్యవస్థపై ఉంది.

మీ మౌనం వెనుక ఉద్దేశం ఏమిటి?: ఈ వ్యవహారంపై ఇప్పటికే పత్రికల్లో కథనాలు వచ్చాయి, టీవీ ఛానళ్లలో చర్చలు కూడా జరిగాయి, అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరం. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత సహా కూటమి నాయకులు ఇప్పటికైనా స్పందించాలి. మీ పార్టీకి చెందిన వారే ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటే వారిని నియంత్రించి చర్యలు తీసుకోండి, లేదంటే ఈ వ్యాఖ్యలతో మీ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బహిరంగంగా ప్రకటించండి. మీ పేర్లు చెప్పుకుంటూ ఇలాంటి దాడులకు పాల్పడుతుంటే మీరు మౌనంగా ఉండటం చూస్తుంటే వారిని సమరిస్తున్నారా, ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానం కలుగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి దూషణలకు భయపడరు, కానీ సమాజంలో మరెవరూ ఇటువంటి సైబర్ వేధింపులకు గురికాకూడదన్న ఉద్దేశంతోనే పోలీసులను ఆశ్రయించాం. సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననానికి, మహిళల గౌరవాన్ని దెబ్బతీయడానికి వేదికగా మార్చే వారిని ఉపేక్షించకూడదు. పోలీసులు ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించి బాధ్యులందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సైబర్ బుల్లీయింగ్‌ను ఖండించాలని, కూటమి పెద్దలు తమ మౌనం వీడి ఈ ఘటనపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కాకాణి పూజిత డిమాండ్ చేశారు.

జి.కొండూరు మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీలకు ఎన్డీఏ కూటమి సర్పంచ్ అభ్యర్థుల ఖరారు

గ్రామ కమిటీ నాయకులు, కూటమి శ్రేణుల సమిష్టి నిర్ణయం మేరకు అభ్యర్థుల ఎంపిక



ఎన్టీఆర్ జిల్లా, బ్యూరో చీఫ్, నవంబరు 15: నంది పత్రిక జి.కొండూరు మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో ఎన్డీఏ కూటమి తరఫున సర్పంచ్ పదవులకు పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితా ఖరారైంది. ఆయా గ్రామాలకు చెందిన గ్రామ కమిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, జనసేన, బీజేపీ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులు సమిష్టిగా చర్చించి తీసుకున్న నిర్ణయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేశారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకుల సిఫారసులు, ఎన్డీఏ కూటమి గ్రామస్థాయి నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన అభ్యర్థుల జాబితాను మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం పరిశీలించి ధ్రువీకరించింది. ఈ మేరకు మొత్తం 22 గ్రామ పంచాయతీలకు ఎన్డీఏ కూటమి అభ్యర్థుల పేర్లను వెల్లడించారు.

22 గ్రామ పంచాయతీల వారీగా ఎన్డీఏ కూటమి సర్పంచ్ అభ్యర్థులు

1. జి.కొండూరు: పజ్జూరు విజయకుమార్
2. కోడూరు: ముక్కమల మధుశ్రీ
3. దుగ్గిరాలపాడు: బొల్లినేని కొండలు
4. తెల్లదేవరపాడు: లింగాల జయమ్మ
5. సున్నంపాడు: దేశం వెంకట పావని
6. మునగపాడు: బర్రె దీవేనమ్మ
7. చెరువు మాధవరం: ఇర్ల శ్రీనివాసరావు
8. గడ్డమణుగు: నూతక్కి అపర్ణ
9. కట్టుబడిపాలెం: లకావత్ ప్రసాద్
10. కవులూరు: గరిమెళ్ళ శివప్రసాద్
11. చెవుటూరు: పసుపులేటి నరేష్ (జనసేన)
12. గుర్రాజుపాలెం: మేరుగ స్వాతి (జనసేన)
13. కందులపాడు: వీసం ప్రభాకర్
14. హవేలీ ముత్యాలంపాడు: పొనుగుమాటి వెంకాయమ్మ
15. వెలగలేరు: చిరుమామిళ్ల రవికుమార్
16. ఆత్కూరు: మెండెం లూర్దమ్మ
17. పినపాక: గుణమాల శ్రీనివాసరావు
18. చిననందిగామ: బోలమాల బాబూరావు
19. గంగినేని: మంగలంపాటి ఉదయశ్రీ
20. కుంటముక్కల: పోతురాజు అనూష
21. వెంకటాపురం: సంకు మేరీ నిర్మల
22. వెల్లటూరు: మందపాటి అర్జునరావు

మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రజా సమస్యలను పరిష్కరించడం, గ్రామస్థాయిలో మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా కూటమి నాయకులు సమన్వయంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా ఎన్డీఏ కూటమి శ్రేణులన్నీ ఐక్యంగా ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయి.

కృష్ణాజిల్లా వైసీపీ మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం (అబూ) టీడీపీలో చేరిక





250 మంది అనుచరులతో టీడీపీ తీర్థం...కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

తప్పు తెలుసుకున్నా...ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ కోరిన అబూ

గుడివాడలో కూటమి పాలనలో స్పష్టమైన మార్పు చూస్తున్నారు: ఎమ్మెల్యే రాము

పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలనుకునే వారిని స్వాగతిస్తాను....

గుడివాడ, బ్యూరో చీఫ్ నవంబర్ 15 నంది పత్రిక :కృష్ణాజిల్లా వైసీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం (అబూ) టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉదయం వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన అబూ, ఆదివారం సాయంత్రం 250 మంది అనుచరులు, మైనార్టీ నాయకులు, యువతతో కలిసి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, పెద్ద సంఖ్యలో మైనార్టీ సోదరులు టీడీపీలో చేరడం హర్షణీయమన్నారు. గుడివాడపై ఉన్న ప్రేమతోనే వారంతా పార్టీలోకి వచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుడివాడ రూపురేఖలు మారాయని, అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనార్టీల చిరకాల కోరిక అయిన షాదీఖానా అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయడంతో పాటు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. గుడివాడ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని, కొత్తగా చేరిన వారు, పాత కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. అబూ మాట్లాడుతూ, తన అనాలోచిత నిర్ణయం వల్ల గత ఎన్నికల ముందు టీడీపీకి దూరమై తప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ వేదికపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాముపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణలు కోరుతున్నానని తెలిపారు. ఇటీవల తాను ఎక్కడికి వెళ్లినా ప్రజలంతా ఎమ్మెల్యే రాము మంచితనాన్ని చెప్పుకుంటున్నారని, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూస్తున్నామని చెబుతున్నారని, అందుకే ఆత్మపరిశీలన చేసుకుని తిరిగి సొంత గూటికి చేరానని అన్నారు. జీవితాంతం టీడీపీలోనే కొనసాగుతానని, రామన్న నాయకత్వంలో గుడివాడ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు మాట్లాడుతూ, మనసున్న నాయకుడు రామన్న నాయకత్వంలో పనిచేయడం గర్వకారణమని, అబూ రాకతో మైనార్టీ విభాగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

అబూతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో యువత టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, టిడిపి నాయకులు లింగం ప్రసాద్ , పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్ మోహన్ రావు, షేక్ మౌలాలి,సయ్యద్ మున్వర్,మహమ్మద్ రఫీ,సయ్యద్ గఫర్ ,మల్లికా బేగం, పెద్ద సంఖ్యలో మైనార్టీ యువత పాల్గొన్నారు.

తిరుమల వెళ్లే భక్తులకు అలర్ట్.. ఫిబ్రవరి నెల శ్రీవారి దర్శనం, సేవా టికెట్ల షెడ్యూల్ ఇదిగో!

నవంబర్ 18న ఉదయం 10 గంటలకు ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

నవంబర్ 21న కల్యాణోత్సవం, వర్చువల్ సేవల కోటా విడుదల

నవంబర్ 23న అంగప్రదక్షిణ, శ్రీవాణి, దివ్యాంగుల దర్శన టోకెన్లు అందుబాటులోకి

నవంబర్ 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల

నవంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతి గదుల కోటా రిలీజ్


తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలనుకునే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు మరియు వసతి గదుల ఆన్‌లైన్ కోటాను విడుదల చేసే తేదీల షెడ్యూల్‌ను టీటీడీ అధికారికంగా వెల్లడించింది.

నవంబర్ 18 నుంచి ఆర్జిత సేవల డిప్ నమోదు శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) కోటాను నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. భక్తులు ఈ సేవా టికెట్ల కోసం నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన వారు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు నిర్ణీత రుసుము చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

నవంబర్ 21న సాధారణ ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను నవంబర్ 21న ఉదయం 10 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచనున్నారు.

నవంబర్ 23న అంగప్రదక్షిణ, శ్రీవాణి, వృద్ధుల కోటాఅంగప్రదక్షిణ టోకెన్ల కోటాను నవంబర్ 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను అదే రోజు ఉదయం 11 గంటలకు భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే, వయోవృద్ధులు, దివ్యాంగులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి కోసం ఉద్దేశించిన ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను నవంబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

నవంబర్ 24న ప్రత్యేక ప్రవేశ దర్శనం, గదుల కోటాభక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన (రాజుణ) టికెట్ల కోటాను నవంబర్ 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల (అకామడేషన్) కోటాను భక్తుల కోసం అందుబాటులో ఉంచనున్నారు. శ్రీవారి భక్తులు దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ "ఎవఙురేష్ఖుఉఖుఎం.ఖజూ.ఠ్రశీజ.అఆ ను మాత్రమే ఉపయోగించాలని, నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని అధికారులు స్పష్టం చేశారు.



షోరూమ్ ట్రయల్ రూమ్‌లో యువతి మృతదేహం.. మరిదిపై అనుమానం!

ఢిల్లీలోని ఓ ప్రముఖ షోరూంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మోతీనగర్ ప్రాంతంలోని ఓ క్లాతింగ్ స్టోర్ ట్రయల్ రూమ్‌లో 19 ఏళ్ల యువతి రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపింది. మృతురాలిని షబ్నమ్‌గా గుర్తించారు. ఆమె గత మూడు నెలలుగా అదే స్టోర్‌లో ఉద్యోగినిగా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం దుకాణం మూసివేసే సమయంలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. తోటి ఉద్యోగిని అన్ను తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 6:45 గంటల సమయంలో షబ్నమ్ స్టోర్‌లో కూర్చుని ఉంది. ఆ తర్వాత రాత్రి 7:30 నుంచి 7:45 గంటల సమయంలో దుకాణం యజమాని ఫోన్ చేసి, కస్టమర్లు ఎవరూ లేకపోవడం మరియు షబ్నమ్ కూడా కనిపించకపోవడంతో దుకాణం షట్టర్ దించేయాలని సూచించారు. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో దుకాణాన్ని మూసేశారు. అయితే, రాత్రి 8:30 గంటల సమయంలో కొందరు సిబ్బంది సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా షబ్నమ్ దుకాణం నుంచి బయటకు వెళ్లిన దృశ్యాలు కనిపించలేదు. ఆమె లోపలే ఉండి ఉండవచ్చని అనుమానించి పరిశీలించగా, బయట నుంచి లాక్ చేసి ఉన్న ట్రయల్ రూమ్ తలుపు కింద నుంచి రక్తం కారుతుండటం కనిపించింది. భయాందోళనకు గురైన సిబ్బంది వెంటనే పోలీసులకు, ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రయల్ రూమ్ తలుపులు తెరిచి చూడగా, ఆమె మృతిచెంది పడి ఉంది.

ఈ దారుణంపై మృతురాలి తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షబ్నమ్ మరిది (భర్త సోదరుడు) సూరజ్ ఈ హత్యకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. రాత్రి 9 గంటల సమయంలో తన కుమార్తె చనిపోయినట్లు తెలిసిందని, తాను గ్రామంలో ఉండటంతో వెంటనే ఢిల్లీకి బయలుదేరి వచ్చానని తెలిపారు. తన కుమార్తెను పొట్టనబెట్టుకున్న వారికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు.దాదాపు ఏడాదిన్నర క్రితం అత్తింటివారితో తీవ్ర వివాదం జరిగిందని, ఆ వివాదం తీవ్రరూపం దాల్చడంతో కేసు నమోదై ప్రస్తుతం తీస్ హజారీ కోర్టులో విచారణ జరుగుతోందని ఆయన వివరించారు. గతంలో జరిగిన గొడవల సమయంలోనే.. ఆమెను కొట్టడం కాదని, ఏకంగా చంపేయాలని అత్త బెదిరించినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి నిందితుడు సూరజ్ పరారీలో ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com